

## రెచ్చగొట్టే వ్యాఖ్యలు, క్రైం బిల్లుపై

# సెలక్ట్ కమిటీ చర్చ

### విద్వేషపూరిత ప్రసంగాలపై అసెంబ్లీలో బిల్లు: పొన్నం

**హైదరాబాద్, ఆగస్ట్ 1:** తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ ఛాంబర్లో సెలక్ట్ కమిటీ సమావేశం శనివారం జరిగింది. సెలక్ట్ కమిటీ చైర్మన్ మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన ఈ భేటీ నిర్వహించారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. రెచ్చగొట్టే వ్యాఖ్యలు, క్రైం బిల్లుపై సెలక్ట్ కమిటీ చర్చించింది. అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు ముగిసేలోపు ఓ నివేదికను సమర్పించే దిశగా ఈ కమిటీ కార్యాచరణ రూపొందించనుంది. ఈ సమావేశంలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, కమిటీ సభ్యులు దానం నాగేందర్, మధుసూదన్ రెడ్డి, యశస్విని రెడ్డి, కవ్వంపల్లి సత్యనారాయణ, కోవా లక్ష్మి, కూనంనేని సాంబశివరావు, మాణిక్ రావు పాల్గొన్నారు. మరోసారి హేట్ బిల్, స్పీచ్ బిల్లు కాపీలను సభ్యులందరికీ చైర్మన్ పొన్నం ప్రభాకర్ ఇచ్చారు. అనంతరం మంత్రి పొన్నం మీడియాతో మాట్లాడారు. వారం రోజుల్లో మరోసారి తమ కమిటీ సమావేశం కానుందని తెలిపారు. వచ్చే సమావేశంలో సభ్యులందరీ నుంచి సూచనలను తీసుకుంటామని చెప్పుకొచ్చారు. అసెంబ్లీలో విద్వేషపూరిత ప్రసంగాల నిరోధానికి చట్టం తీసుకువస్తామని స్పష్టం చేశారు. శాసనసభలో విద్వేషపూరిత ప్రసంగాలు చేయకుండా తమ కమిటీ నివేదిక సిద్ధం చేస్తుందని తెలిపారు. ఆయా రాజకీయ పార్టీలతో పాటు సమాజంలో పేరొందిన వారి సలహాలు తీసుకుంటామని అన్నారు. వ్యక్తుల గౌరవం కాపాడే విధంగా తమ కమిటీ నివేదిక ఉంటుందని వివరించారు. భావప్రకటన స్వేచ్ఛకు భంగం కలిగించబోమని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

## పేపర్ లీకేజీ బిల్లుకు చట్టబద్ధత

### పార్లమెంట్ ఆమోదించిన బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 1:** దేశంలో పేపర్ లీకేజీలను అరికట్టేలా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన యాంటీ పేపర్ లీక్ అమెండ్‌మెంట్ బిల్లును రాష్ట్రపతి ద్రౌపది ముర్మ శనివారం ఆమోదించారు. దీంతో ఇకపై ఈ బిల్లు చట్టంగా అమలులోకి రానుంది. 'పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) అమెండ్‌మెంట్ బిల్, 2026' పేరుతో రూపొందిన ఈ బిల్లును ఈ వారంలోనే పార్లమెంట్ ఆమోదించింది. అటు లోక్‌సభలో చర్చ అనంతరం ఆమోదం పొందగా, మరుసటి రోజు రాజ్యసభలో కూడా ఆమోదం లభించింది. దీంతో వెంటనే ఈ బిల్లు ఆమోదం కోసం రాష్ట్రపతి ద్రౌపది ముర్మ వద్దకు పంపింది ప్రభుత్వం. ఇటీవల నీట్ పేపర్ లీకేజీకి వ్యతిరేకంగా సీజేపీ ఆధ్వర్యంలో ఢిల్లీలో జరిగిన ఆందోళన గురించి తెలిసిందే. ఈ ఉద్యమం నేపథ్యంలో కేంద్రం పేపర్ లీకేజీలను అరికట్టేలా కొత్త బిల్లును తీసుకొచ్చింది. ఇదే అంశంలో 2024లో తెచ్చిన బిల్లుకు సవరణలు తెస్తూ కొత్త బిల్లును ప్రవేశపెట్టింది. ఈ బిల్లును కాంగ్రెస్ సహా అనేక ప్రతిపక్షాలు వ్యతిరేకించాయి. ఈ బిల్లు ద్వారా పూర్తిస్థాయిలో పేపర్ లీకేజీలను అరికట్టలేమని ప్ర తిపక్షాలు వ్యాఖ్యానించాయి. అయితే, పేపర్ లీకేజీలను అడ్డుకునేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, అందువల్లే కొత్త బిల్లును రూపొందించామని కేంద్రం సమర్థించుకుంది. గతంలో పేపర్ లీకేజీ కేసుల విచారణకు కాల పరిమితి అంటూ లేదు. కొత్త బిల్లు ప్రకారం ఈ కేసుల విచారణను రెండు నెలల్లో పూర్తి చేయాలి.

## గ్రీన్ కారిడార్‌గా మారిన

# హైదరాబాద్ మెట్రో

### అవయవ మార్పిడికి గుండె, ఊపిరితిత్తుల వేగవంతమైన తరలింపు

### 25 నిమిషాల్లో 14 కిలోమీటర్లు పూర్తి చేసి ప్రాణం కాపాడిన మెట్రో

**హైదరాబాద్, ఆగస్టు 1:** హైదరాబాద్ మెట్రో రైలు మరోసారి తన మానవతా దృక్పథాన్ని చాటుకుంది. నగర ట్రాఫిక్‌ను అధిగమిస్తూ అవయవ మార్పిడి శస్త్రచికిత్స కోసం దాత నుంచి సేకరించిన గుండె, ఊపిరితిత్తులను అత్యంత వేగంగా గమ్యస్థానానికి చేర్చేందుకు ప్రత్యేక గ్రీన్ కారిడార్‌గా సేవలందించింది. వైద్య బృందాలతో సమన్వయం చేసుకుంటూ కీలక సమయంలో స్పందించిన మెట్రో అధికారులు మరో ప్రాణాన్ని కాపాడడంలో కీలక పాత్ర పోషించారు. గచ్చిబౌలిలోని కేర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దాత నుంచి సేకరించిన గుండె, ఊపిరితిత్తులను సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రికి అత్యవసరంగా తరలించాల్సిన పరిస్థితి ఏర్పడింది. రోడ్డు మార్గంలో ట్రాఫిక్ సమస్యల కారణంగా ఆలస్యమయ్యే అవకాశం ఉండటంతో వైద్యులు హైదరాబాద్ మెట్రో అధికారులను ఆశ్రయించారు. వెంటనే స్పందించిన అధికారులు రాయదుర్గం మెట్రో స్టేషన్ నుంచి రసూల్‌పురా వరకు ప్రత్యేక గ్రీన్ కారిడార్‌ను ఏర్పాటు చేసి అవయవాల రవాణాకు ప్రాధాన్యత కల్పించారు. మార్గమధ్యంలోని 13 మెట్రో స్టేషన్లను దాటుకుంటూ కేవలం 25 నిమిషాల్లోనే సుమారు 14 కిలోమీటర్ల దూరాన్ని పూర్తి చేసి గుండె, ఊపిరితిత్తులను సురక్షితంగా కిమ్స్ ఆస్పత్రికి చేర్చారు. అవయవ మార్పిడి చికిత్సలో ప్రతి నిమిషం కీలకమైన నేపథ్యంలో వైద్య బృందాలు, మెట్రో సిబ్బంది పూర్తి సమన్వయంతో వ్యవహరించి ఈ అత్యవసర ఆపరేషన్‌ను విజయవంతం చేశారు. ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, అదే సమయంలో అవయవాల రవాణాలో ఆలస్యం జరగకుండా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. సమయానికి అవయవాలు ఆస్పత్రికి చేరడంతో



రోగికి అవయవ మార్పిడి శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించేందుకు అవకాశం లభించింది. అత్యవసర వైద్య సేవలకు హైదరాబాద్ మెట్రో అందిస్తున్న సహకారంపై వైద్యులు, నగరవాసులు ప్రశంసలు కురిపిస్తున్నారు. వేగవంతమైన రవాణా సేవలతో పాటు ప్రాణాలను కాపాడే మానవతా కార్యక్రమాల్లోనూ హైదరాబాద్ మెట్రో ముందుంటోందని ఈ ఘటన మరోసారి నిరూపించింది.

# కొత్త శిఖరాలకు తెలంగాణ ఆర్థికాభివృద్ధి

### తలసరి ఆదాయం రూ.4,18,931కు చేరిక

### సీఎం రేవంత్ రెడ్డి వెల్లడి

**హైదరాబాద్, ఆగస్ట్ 1:** తెలంగాణ ఆర్థికాభివృద్ధి కొత్త శిఖరాలను అధిరోహిస్తోందని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర తలసరి ఆదాయం రూ.4,18,931కు చేరిందని, గతేడాదితో పోలిస్తే రూ.38,900 పెరిగిందని ఆయన వెల్లడించారు. ఒకే ఏడాదిలో 10.23 శాతం వృద్ధి నమోదు చేయడం తెలంగాణ ఆర్థిక వృద్ధికి నిదర్శనమని అన్నారు. దేశంలో అత్యుత్తమ పనితీరు కనబరిచిన రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటిగా నిలిచిందని పేర్కొంటూ.. పెట్టుబడుల ఆకర్షణ, ఉపాధి కల్పన, పరిశ్రమల అభివృద్ధి, ఆర్థిక వృద్ధి కారణంగానే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని తెలిపారు. విధానపరమైన పాలన, పారదర్శక నిర్ణయాలు, పెట్టుబడులకు అనుకూల వాతావరణం వల్ల తెలంగాణ అభివృద్ధి వేగంగా సాగుతోందని రేవంత్ రెడ్డి అన్నారు. ఈ అభివృద్ధి ఫలాలు ముఖ్యంగా మహిళలు, రైతులు, యువతకు చేరుతున్నాయని ఆయన పేర్కొన్నారు. గత దశాబ్దంలో నెలకొన్న నిరాశను తొలగించి ప్రజల్లో కొత్త ఆశావాదాన్ని నింపామని, తెలంగాణను దేశంలో అభివృద్ధికి ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. రానున్న సంవత్సరాల్లో మరిన్ని పెట్టుబడులు, ఉపాధి అవకాశాలతో తెలంగాణ మరింత పురోగతి సాధిస్తుందని సీఎం ఆశాభావం వ్యక్తం చేశారు.

### పెట్టుబడులు లక్ష్యంగా సీఎం విదేశీ టూర్

తెలంగాణకు భారీ పెట్టుబడులు తీసుకురావడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి త్వరలో విదేశీ పర్యటనకు వెళ్లనున్నారు. ఆగష్టు 20 నుంచి సెప్టెంబరు 8 వరకు దాదాపు 20 రోజులపాటు వివిధ దేశాల్లో సీఎం పర్యటించనున్నారు. అమెరికా, యూకే సహా మరికొన్ని కీలక దేశాలకు ఆయన వెళ్లనున్నట్టు సమాచారం. అయితే ఆయా దేశాల్లోని కంపెనీల ప్రతినిధులు,



అపాయింట్‌మెంట్‌ల నేపథ్యంలో సీఎం టూర్ షెడ్యూల్ ఆగష్టు 20-23 తేదీల మధ్య ఉండవచ్చని కూడా అధికార వర్గాల ద్వారా తెలిసింది. ఈ పర్యటనలో ప్రపంచ ప్రఖ్యాత కంపెనీల ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, పెట్టుబడి సంస్థలు, ప్రవాస భారతీయులతో సీఎం సమావేశాలు నిర్వహించనున్నారు. ఐటీ, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, డేటా సెంటర్లు, సెమీ కండక్టర్లు, ఎలక్ట్రానిక్స్ తయారీ, లైఫ్ సైన్సెస్, ఫార్మా, గ్రీన్ ఎనర్జీ, ఏరోస్పేస్, డిఫెన్స్ తయారీ రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా సీఎం టూర్ ఉండొచ్చని సమాచారం. అమెరికాలో చిప్ తయారీ, క్లౌడ్ కంప్యూటింగ్, ఏఐ కంపెనీలతో, లండన్‌లో గ్లోబల్ ఫైనాన్షియల్ ఇన్వెస్టర్లు, విద్యా సంస్థల ప్రతినిధులతో చర్చలు జరిపే అవకాశం ఉంది. అలాగే గతంలో విదేశీ పర్యటనల సంద ర్భంగా పలు అంతర్జాతీయ సంస్థలతో తెలంగాణ ప్రభుత్వం అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్న నేపథ్యంలో.. ఆయా కంపెనీల ప్రతినిధులతోనూ రేవంత్ భేటీ అయ్యే అవకాశాలున్నాయి. చట్టసభల్లోకి ప్రవేశించే వయసును 21కి తగ్గించాలని అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపుతామని ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ అంశంపై తీర్మానం చేసేందుకు ఆగష్టు 17-18 తేదీల్లో ఒక రోజు ప్రత్యేక అసెంబ్లీ సెషన్ నిర్వహించాలని ప్రాథమికంగా నిర్ణయించినట్టు తెలిసింది. ఇక వర్షాకాల సమావేశాలను సెప్టెంబరు మూడో వారంలో వారంపాటు నిర్వహించే అవకాశం ఉందని సమాచారం. ఆగస్టులో సీఎం విదేశీ పర్యటనకు ప్రాథమిక షెడ్యూల్ ఖరారైన నేపథ్యంలో.. సెప్టెంబరు రెండో వారం వరకు ఆయన తిరిగి రాష్ట్రానికి వస్తారని, మూడో వారంలో అసెంబ్లీ సమావేశాలు ఉంటాయనే చర్చ సచివాలయంలో జరుగుతోంది.

### చెరువుల పరిరక్షణతో భావితరాలకు భద్రత

నగరంలోని చెరువుల పునరుద్ధరణతో హైదరాబాద్ రూపురేఖలు మారుతున్నాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. జలవనరులను పరిరక్షిస్తూ నగరానికి పూర్వ వైభవాన్ని తీసుకురావడంలో హైడ్రా చేపడుతున్న చర్యలు ప్రశంసనీయమని ఆయన అన్నారు. చెరువుల పునరుజ్జీవనంతో నగరానికి కొత్త అందం చేకూరుతుండటంతో పాటు భావితరాలకు మెరుగైన భవిష్యత్తుకు బాటలు పడుతున్నాయని పేర్కొన్నారు. ఉప్పల్‌లోని నల్ల చెరువు పునరుద్ధరణ పనులను విజయవంతంగా పూర్తి చేయడంలో అహర్నిశలు శ్రమించిన హైడ్రా అధికారులు, సిబ్బందిని ముఖ్యమంత్రి ప్రత్యేకంగా అభినందించారు. చెరువులను పరిరక్షించడం అంటే కేవలం నీటి వనరులను కాపాడడం మాత్రమే కాదని, భావితరాల భవిష్యత్తును భద్రపరచడమేనని ఆయన స్పష్టం చేశారు. ప్రతి చెరువును కంటికి రెప్పలా సంరక్షించడంతో పాటు ప్రతి అంగుళం ప్రజా ఆస్తిని కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం తెలిపారు. నగరంలోని చెరువులు, కుంటలు, ఇతర జలవనరుల పరిరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, పర్యావరణ పరిరక్షణతో పాటు నగర అభివృద్ధిని సమన్వయం చేస్తూ ముందుకు సాగుతున్నామని రేవంత్ రెడ్డి వెల్లడించారు.

# గోదావరి జలాలను పూర్తిస్థాయిలో వినియోగిస్తాం

మొదటి పేజీ తరువాయి

ఫ్లో కాలువ ద్వారా మిడ్ మానేర్‌కు నీటిని తరలించేందుకు ఐదు పంపులను ప్రారంభించారు. గోదావరి జలాల్లో ఒక్క చుక్క కూడా వృథా కాకుండా సమర్థవంతంగా వినియోగించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, మంత్రి జి. వివేక్ వెంకటస్వామి, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌తో పాటు ఉన్నతాధికారులతో కలిసి ప్రాజెక్టుల్లోకి వస్తున్న వరద ప్రవాహాలు, నీటి నిల్వలు, పంపింగ్ కార్యకలాపాలను ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్షించారు. నీటి నిర్వహణలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా గంట గంటకు పరిస్థితిని పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. ఎల్లంపల్లి నుంచి తరలిస్తున్న నీటిని "కాళేశ్వరం నీరు"గా ప్రచారం చేయడం సరికాదని మంత్రి స్పష్టం చేశారు. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రతిపాదించిన ప్రాణహిత--చేవెళ్ల ప్రాజెక్టులో భాగమని, ప్రస్తుతం అక్కడికి చేరుతున్నది గోదావరి సహజ ప్రవాహమే తప్ప కాళేశ్వరం బ్యారేజీల నుంచి ఎత్తిపోసిన నీరు కాదని వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో నిర్మించిన శ్రీరాంసాగర్, కడెం, నాగార్జునసాగర్, శ్రీశైలం, ఫ్లడ్ ఫ్లో కాలువ వంటి ప్రాజెక్టులు ఇప్పటికీ రాష్ట్రానికి సమర్థవంతంగా సేవలందిస్తున్నాయని మంత్రి పేర్కొన్నారు. అయితే 2016 నుంచి 2019 మధ్య నిర్మించిన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో 2023 నాటికే తీవ్రమైన నిర్మాణ లోపాలు బయటపడ్డాయని విమర్శించారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణ పూర్తిగా శాస్త్రీయ ప్రమాణాలు, నిపుణుల సూచనల ఆధారంగానే చేపడుతున్నామని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ వ్యవహారంలో ఎలాంటి రాజకీయ ఉద్దేశం లేదని, జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థ (ఎన్‌డీఎస్‌ఏ), కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) సూచనల మేరకే బ్యారేజీల్లో నీటి నిల్వలను నిలిపివేశామని తెలిపారు. జూన్ 30న ఏర్పాటు చేసిన కేంద్ర సాంకేతిక పర్యవేక్షణ కమిటీ మొత్తం ప్రక్రియను పర్యవేక్షిస్తోందని, ఐఐటీ బాంబే, ఏఎఫ్‌ఆర్‌వై ఇండియా సంస్థలు పునరుద్ధరణ నమూనాలను సిద్ధం చేస్తున్నాయని చెప్పారు. మరో రెండు నుంచి మూడు నెలల్లో నివేదిక అందనున్నట్లు వెల్లడించారు.



పునరుద్ధరణలో భాగంగా డయాఫ్రామ్ వాల్ నిర్మాణం, స్టిల్లింగ్ బేసిన్ విస్తరణ వంటి కీలక పనులు చేపట్టనున్నట్లు మంత్రి వివరించారు. నమూనాలు ఖరారైన వెంటనే మరమ్మతులు ప్రారంభించి వచ్చే వర్షాకాలానికి ముందే బ్యారేజీలను పునరుద్ధరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. కన్నెపల్లి పంపులను ప్రస్తుతం ప్రారంభించలేని పరిస్థితి ఉందని మంత్రి వివరించారు. అక్కడి నుంచి ఎత్తిపోసే నీటిని అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో నిల్వ చేయాల్సి ఉంటుందని, ఆయా బ్యారేజీల నిర్మాణ భద్రతపై నిపుణుల పరిశీలన కొనసాగుతున్నందున ప్రస్తుతం పంపింగ్ సాధ్యం కాదని చెప్పారు. అసలు డీపీఆర్‌కు విరుద్ధంగా సెకెంట్ పైల్ ఫౌండేషన్ నిర్మాణంలో లోపాలు జరిగినట్లు నిపుణులు గుర్తించారని వెల్లడించారు. గోదావరి జలాలపై కొందరు రాజకీయ పార్టీలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ హయాంలో నిర్మించిన ఎల్లంపల్లి ప్రాజెక్టు నీటికి ఇతరులు క్రెడిట్ తీసుకునే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. గత ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులపై రూ.1.81 లక్షల కోట్లు ఖర్చు చేసినప్పటికీ కొత్తగా సాగునీటి విస్తీర్ణం ఆశించిన స్థాయిలో పెరగలేదని, కాళేశ్వరం ద్వారా లక్ష ఎకరాలకు కూడా స్థిరమైన సాగునీరు అందలేదని అన్నారు. పాలమూరు--రంగారెడ్డి వంటి పలు ప్రాజెక్టులు కూడా అసంపూర్తిగా మిగిలిపోయాయని విమర్శించారు. తెలంగాణలో ప్రస్తుతం ఏటా దాదాపు 300 లక్షల మెట్రిక్ టన్నుల వరి ఉత్పత్తి నమోదవుతోందని, ఇటీవల 152 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు మంత్రి తెలిపారు. దెబ్బతిన్న బ్యారేజీల నీటిని వినియోగించకుండానే ఈ రికార్డు స్థాయి ఉత్పత్తి సాధ్యమైందని పేర్కొన్నారు. రైతుల ఖాతాల్లో ఇప్పటికే సుమారు రూ.80 వేల కోట్లు జమ చేశామని గుర్తుచేశారు. ఉత్తర తెలంగాణ రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, సాగునీరు, తాగునీరు, వ్యవసాయ అవసరాల కోసం గోదావరి జలాలను పూర్తిస్థాయిలో వినియోగించేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని ఉత్తమ్ కుమార్ రెడ్డి భరోసా ఇచ్చారు.

# ధరణి అక్రమాలపై ఉక్కుపాదం

- పేదల భూములు కాజేసిన వారిని వదిలిపెట్టం
- ఫాస్ట్‌ట్రాక్ విచారణతో భూ అక్రమాల బట్టబయలు
- నిషేధిత జాబితాలో అంగుళం భూమి చేర్చలేదు
- భూముల ధరల సవరణతో ఆదాయం పెరిగింది
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 1:** ధరణి పోర్టల్‌ను అడ్డుపెట్టుకుని జరిగిన భూ అక్రమాలపై రాష్ట్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ధరణి నుంచి భూభారతి వరకు జరిగిన ప్రతి భూ లావాదేవీని ఫాస్ట్‌ట్రాక్ విధానంలో విచారిస్తున్నామని, పేదల భూములు, ప్రభుత్వ భూములను అక్రమంగా కాజేసిన వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టబోమని హెచ్చరించారు. సచివాలయంలో మీడియాతో చిట్‌చాట్ నిర్వహించిన మంత్రి, అక్రమాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ధరణి పోర్టల్‌ను అడ్డుగా చేసుకుని భారీ స్థాయిలో భూ అక్రమాలు, అక్రమ మ్యుటేషన్లు, ప్రభుత్వ భూముల బదిలీలు జరిగాయని పేర్కొన్న ఆయన, ప్రస్తుతం ప్రతి వ్యవహారాన్ని ఆధారాలతో సహా సమగ్రంగా పరిశీలిస్తున్నామని తెలిపారు. ఎవరి హయాంలో ఎంత భూమి నిషేధిత జాబితాలో చేరింది, దానిని ఎవరు, ఎప్పుడు, ఏ కారణాలతో చేర్చారు, అనంతరం ఎందుకు తొలగించారు అనే అంశాలన్నింటినీ ప్రభుత్వం క్షుణ్ణంగా పరిశీలిస్తోందని చెప్పారు. ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలను కూడా అదే స్థాయిలో విచారిస్తున్నామని పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిషేధిత జాబితాలో కొత్తగా ఒక్క అంగుళం భూమిని కూడా చేర్చలేదని మంత్రి స్పష్టం చేశారు. హైకోర్టు ఆదేశాల మేరకు ధరణి పోర్టల్‌లో ఇప్పటికే ఉన్న నిషేధిత జాబితానే కోర్టుకు సమర్పించామని, వివాదాలు లేని ప్రైవేట్ ఆస్తులు లేదా ప్లాట్లను ప్రభుత్వం కొత్తగా నిషేధిత జాబితాలో చేర్చిందన్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని కొట్టిపారేశారు. రాష్ట్రంలో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపాలనే లక్ష్యంతో ప్రభుత్వం రీ-సర్వే చేపట్టిందని మంత్రి తెలిపారు. ఇప్పటికే 276 గ్రామాల్లో సర్వే పూర్తయిందని, ప్రతి సర్వే నంబర్‌కు ఆధార్ తరహాలో ప్రత్యేక 'భూధార్' నంబర్ కేటాయించే ప్రక్రియ కొనసాగుతోందన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని, కేవలం రెండు శాతం మాత్రమే అభ్యంతరాలు వచ్చినట్లు వెల్లడించారు. రాష్ట్రంలో సుమారు 85 వేల ఎకరాల అసైన్డ్ భూములు ఉన్నాయని, వాటి వినియోగంపై త్వరలో సమగ్ర విధాన నిర్ణయం తీసుకుంటామని మంత్రి తెలిపారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అన్ని కోణాల్లో ప్రభుత్వం అధ్యయనం చేస్తోందన్నారు. ప్రభుత్వ భూముల పరిరక్షణలో ఎలాంటి రాజీ ఉండదని, నిబంధనల ప్రకారమే ప్రతి నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. క్యూర్ పరిధిలో నిర్మిస్తున్న ఇందిరమ్మ టవర్స్‌పై బీఆర్ఎస్ నేతలు చేస్తున్న విమర్శలను మంత్రి ఖండించారు. కొల్లూరులో గత ప్రభుత్వం నిర్మించిన 2బీహెచ్‌కే ఇళ్లలో వర్షం వస్తే నీరు కారుతున్న ఘటనలు వారి నాణ్యతకు నిదర్శనమని విమర్శించారు. అయినప్పటికీ ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఆ ఇళ్లను కూడా ప్రభుత్వం మరమ్మతు చేయిస్తుందని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లకు కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోయినా, లబ్ధిదారులు



ఇబ్బంది పడకుండా రాష్ట్ర ప్రభుత్వమే బిల్లులు చెల్లిస్తుందని హామీ ఇచ్చారు. భూముల మార్కెట్ విలువల సవరణతో ప్రభుత్వం అంచనా వేసిన దానికంటే 10 నుంచి 20 శాతం వరకు అధిక ఆదాయం వచ్చిందని మంత్రి వెల్లడించారు. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఆదాయం గణనీయంగా పెరిగిందని, ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సమయంలో సుమారు రూ.13 వేల కోట్లుగా ఉన్న వార్షిక ఆదాయం గత ఏడాది రూ.15 వేల కోట్లకు చేరిందని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అది రూ.18 వేల కోట్లకు చేరే అవకాశం ఉందని తెలిపారు. రిజిస్ట్రేషన్ పత్రాల సంఖ్య కూడా గణనీయంగా పెరిగిందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.

## వనపర్తి జిల్లాలో స్వల్ప వర్షాలు.. పెద్దమందడిలో అత్యధికంగా 17.6 మి.మీ. నమోదు




**సి కె న్యూస్ ప్రతినిధి, వనపర్తి జిల్లా:**వనపర్తి జిల్లాలో శనివారం (01-08-2026) పలుచోట్ల స్వల్ప వర్షాలు కురిశాయి. జిల్లా ప్రణాళిక శాఖ విడుదల చేసిన మండలాల వారీ వర్షపాతం నివేదిక ప్రకారం పెద్దమందడి మండలంలో అత్యధికంగా 17.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

రేవల్లి మండలంలో 14.8 మి.మీ., కొత్తకోటలో 14.2 మి.మీ., మదనాపూర్‌లో 12.6 మి.మీ., ఘనపూర్‌లో 12.4 మి.మీ. వర్షపాతం నమోదైంది. అమరచింతలో 6.8 మి.మీ., వీపనగండ్లలో 5.2 మి.మీ., ఆత్మకూర్‌లో 4.8 మి.మీ., వనపర్తిలో 2.6 మి.మీ., చిన్నంబావిలో 1.8 మి.మీ., గోపాల్‌పేట్, పంగల్ మండలాల్లో చెరో 1.6 మి.మీ., పెబ్బేరు మండలంలో 0.2 మి.మీ. వర్షపాతం నమోదైంది.

అయితే శ్రీరంగాపూర్, ఏదుల మండలాల్లో వర్షపాతం నమోదు కాలేదు. జిల్లాలో మొత్తం 96.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదుకాగా, జిల్లా సగటు వర్షపాతం 6.4 మిల్లీమీటర్లుగా నమోదైనట్లు జిల్లా ప్రణాళిక శాఖ వెల్లడించింది.

## సొంతగూటికి చేరిన కుంటాల సర్పంచ్ గంగారాం మరియు గ్రామస్తులు

- గ్రామ అభివృద్ధి అనిల్ జాదవ్ తోనే సాధ్యం - గ్రామస్తులు



**నేరడిగొండ సి కె . న్యూసు.**నెరడిగొండ మండలంలోని కుంటాల బి గ్రామ సర్పంచ్ గంగారాం మరియు గ్రామస్తులు శనివారం తిరిగి బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే అనిల్ జాదవ్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ఇతర పార్టీలో చేరి తప్పు చేశానని, మా గ్రామ అభివృద్ధికి ఎల్లప్పుడూ సహకరించే ఎమ్మెల్యే అనిల్ జాదవ్ తోనే కొనసాగుతామని గ్రామ పెద్దలతో కలిసి ఒప్పందం చేసుకోవడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ.. గిరిజన గ్రామాల అభివృద్ధికి ఎల్లప్పుడూ కట్టుబడి ఉన్నానని, మీ మండల వాసిగా మీ బిడ్డగా ఎల్లప్పుడూ మీకు అండగా ఉంటానని ఎలాంటి సమస్య వచ్చినా మీతో నిలబడతానని ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 16 గ్యాస్ సిలిండర్లు స్వాధీనం,

- అక్రమ దందా కు పాల్పడితే కఠిన చర్యలు,
- తహసీల్ దార్ బాల లక్ష్మి
- సివిల్ సప్లై ఇన్స్పెక్టర్ నర్సింలు



**ఆగస్ట్ 01 (సీ కే న్యూస్) చేగుంట:**చేగుంట మండల కేంద్రంలోని గల మక్క రాజుపేట చౌరస్తా లో ఉన్న ముడు గ్యాస్ రీఫిల్లింగ్ కేంద్రాలపై జిల్లా సివిల్ సప్లై అధికారులు కస్మాత్తుగా దాడులు నిర్వహించారు. మూడు దుకాణాల్లో
తనిఖీలు చేపట్టి 16 సబ్సిడీ గ్యాస్ సిలిండర్లనుస్వాధీనం చేసుకున్నారు. అనంతరం ముగ్గురు దుకాణ
యజమానులపై కేసులు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలం లో ఏవ్వరైనా అక్రమ గ్యాస్ రీఫిల్లింగకు పాల్పడితే వారి పై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని సివిల్ సప్లై ఇన్స్పెక్టర్
తాటి నర్సింలు తెలిపారు. ఈ కార్యక్రమం లో స్థానిక తహసీల్దార్ బల లక్ష్మి, రెవెన్యూ ఇన్స్పెక్టర్ జై భరత్ రెడ్డి, పోలీస్ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## వనమహోత్సవంలో భాగంగా ఇంటింటికి మొక్కలను పంపిణీ చేసిన సర్పంచ్ పర్చ రామచంద్రరావు



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.**చింతకాని మండలం చిన్నమండవ గ్రామంలో సర్పంచ్ పర్చ రామచంద్రరావు గారి ఆధ్వర్యంలో వనమహోత్సవం లో భాగంగా ఇంటింటికి నేరేడు, మునగా రెండు మొక్కలను సర్పంచ్ గారి ఆధ్వర్యంలో పంపిణీ చేయడం జరిగింది.. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ తంగిరాల మాధవి, వార్డ్ మెంబర్ గుండ్ల కళ్యాణి గుండ్ల బేబీ రాణి, ఫీల్డ్ అసిస్టెంట్ నాగేశ్వరరావు, గుండ్ల సాలయ్య, పర్చగాని తిరుపతి పాల్గొన్నారు..

# నిద్రలోనే గొలుసు మాయం

- శ్రీరాంపురం తండాలో చోరీ కలకలం
- నిద్రలోనే బంగారు గొలుసు ఎత్తుకెళ్లిన దుండగులు
- ఘటన స్థలాన్ని పరిశీలించిన ఎస్ఐ
- సీసీటీవీ ఫుటేజీల ఆధారంగా దర్యాప్తు




**సీకే న్యూస్ ఖమ్మం ప్రతినిధి ఇస్లావత్ నరసింహ ఆగస్టు 01 2026:** ఖమ్మం జిల్లా ఏన్కూరు మండలం సూర్య తండ పంచాయతీ పరిధిలోగల శ్రీరాంపురం తండాలో శుక్రవారం అర్ధరాత్రి చోరీ ఘటన కలకలం రేపింది. ఇంట్లో కుటుంబ సభ్యులంతా గాఢ నిద్రలో ఉండగా గుర్తుతెలియని దుండగులు ఇంట్లోకి చొరబడి, నిద్రిస్తున్న మహిళ మెడలో ఉన్న బంగారు గొలుసును అపహరించి పరారయ్యారు. ఈ ఘటన స్థానికంగా భయాందోళనలకు గురిచేసింది.

స్థానికుల వివరాల ప్రకారం, బాధిత కుటుంబ సభ్యులు రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో దొంగలు చాకచక్యంగా ఇంట్లోకి ప్రవేశించారు. ఎలాంటి శబ్దం చేయకుండా మహిళ మెడలో ఉన్న బంగారు గొలుసును తీసుకుని అక్కడి నుంచి పరారైనట్లు తెలుస్తోంది. ఉదయం నిద్రలేచిన అనంతరం గొలుసు కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు చోరీ జరిగినట్లు గుర్తించి వెంటనే ఏన్కూరు పోలీసులకు సమాచారం అందించారు.

సమాచారం అందుకున్న ఏన్కూరు ఎస్ఐ సంధ్య పోలీసు సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకుని ఘటనపై పూర్తి వివరాలు సేకరించారు. ఇంటి పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించి, అందుబాటులో ఉన్న ఆధారాలను సేకరించారు. దుండగులను గుర్తించేందుకు పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాల ఫుటేజీలను పరిశీలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అలాగే పలు కోణాల్లో దర్యాప్తు కొనసాగుతున్నట్లు వెల్లడించారు.

శ్రీరాంపురం తండాలో అర్ధరాత్రి జరిగిన ఈ చోరీతో గ్రామస్థులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల గ్రామాల్లో చోరీ ఘటనలు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో రాత్రి వేళల్లో పోలీసు గస్తీని మరింత పెంచాలని, అనుమానాస్పద వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఉంచాలని వారు పోలీసులను కోరుతున్నారు. పోలీసులు త్వరలోనే నిందితులను గుర్తించి అరెస్టు చేస్తామని, ప్రజలు అప్రమత్తంగా ఉండి అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

## ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన కూరపాటి కిషోర్



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.**మండలంలోని ప్రొద్దుటూరు గ్రామంలో షేక్ చిన్న అస్సాన్--పిరాంబి దంపతులు నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటిని చింతకాని మండల కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి కూరపాటి కిషోర్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు సొంతింటి కలను సాకారం చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్న ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కలకు గ్రామ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు.

కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కొప్పుల గోవిందరావు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు నున్న నాగయ్య, తోములూరి ముత్తయ్య, చావా అచ్చయ్య, పోనాటి పెద్ద కృష్ణారావు, గ్రామ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## తల్లిపాలే శిశువుకు తొలి అమృతాహారం సర్పంచ్ తాళ్ళూరి స్వప్న

### ప్రపంచ తల్లిపాల వారోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.**జగన్నాధపురంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవం సందర్భంగా శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సర్పంచ్ తాళ్ళూరి స్వప్న హాజరై వారు మాట్లాడుతూ... గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లులకు తల్లిపాల ప్రాముఖ్యతపై వివరించారు. అనంతరం ఏఎన్ఎం రజిని మాట్లాడుతూ..జననం జరిగిన మొదటి గంటలోనే శిశువుకు తల్లిపాలు పట్టించడం, తొలి ఆరు నెలల పాటు కేవలం తల్లిపాలనే అందించడం వల్ల శిశువుకు అవసరమైన పోషకాలు, రోగనిరోధక శక్తి సమృద్ధిగా లభిస్తాయని తెలిపారు. అనంతరం రెండేళ్ల వరకు అనుబంధ ఆహారంతో పాటు తల్లిపాలను కొనసాగించాలని సూచించారు.తల్లిపాల వల్ల తల్లి, బిడ్డ ఇద్దరి ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు చిన్నారుల్లో పోషకాహార లోపం, అంటువ్యాధుల బారిన పడే అవకాశాలు తగ్గుతాయని వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ కాశీమల వెంకమ్మ, ఆశా బందెల అరుణ, ఆయా యరమల పద్మ, సిబ్బంది, గర్భిణులు, బాలింతలు, గ్రామ మహిళలు పాల్గొన్నారు.

# తల్లి పాల వారోత్సవాలు





**పొలంపల్లి అంగన్వాడి టీచర్ ఆధ్వర్యంలో**

**ప్రతి సంవత్సరం ఆగస్టు 1 నుంచి ఆగస్టు 7 వరకు**

**ఆగస్టు 01 (సి కే న్యూస్) చేగుంట :**పొలంపల్లి గ్రామంలోనీ అంగన్వాడి కేంద్రంలో శనివారం నాడు ప్రపంచ తల్లి పాల వారోత్సవాలు అంగన్ వాడి టీచర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. శిశుసంక్షేమ శాఖ ఆదేశాల అనుసారంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమం, అంగన్ వాడి టీచర్, ఏఎన్ఎం మాట్లాడుతూ
తల్లి పాలు బిడ్డకు దేవుడిచ్చిన మొదటి టీకా. దీని గొప్పదనం గురించి అందరికీ తెలియజేయడానికి, తల్లులను ప్రోత్సహించడానికి జరుపుతారు. ఫీడింగ్ ఫర్ ఆల్ అందరికీ తల్లిపాలు మద్దతు,తల్లి పాల వల్ల లాభాలు బిడ్డకు రోగనిరోధక శక్తి, పెంచుతుంది జబ్బులు త్వరగా రావు పోషకాలు పూర్తిగా మొదటి 6 నెలలు వేరే ఏమీ ఆహారం ఇవద్దు ఎదుగుదల బాగుంటుంది, మెదడు, శరీరం ఆరోగ్యంగా పెరుగుతాయి అతిసారం, న్యుమోనియా రిస్క్ 50% తగ్గుతుంది, తల్లికి:రక్తస్రావం తగ్గుతుంది, కాన్పు తర్వాత త్వరగా కోలుకోవడానికి రొమ్ము క్యాన్సర్, అండాశయ క్యాన్సర్ రిస్క్ తగ్గుతుంది, బరువు తగ్గడానికి సహాయపడుతుంది, తల్లి బిడ్డ బంధం బలపడుతుంది,ఆరోగ్యవంతమైన పిల్లలు. ఆసుపత్రి ఖర్చులు తగ్గుతాయి. పుట్టిన 1 గంటలోపుతల్లి పాలు ఇవ్వాలి గోల్డెన్ అవర్ మొదటి 6 నెలలు- తల్లి పాలు మాత్రమే. ఇవ్వాలి నీళ్లు కూడా ఇవ్వద్దు దీన్ని ఎక్స్‌క్లూసివ్ బ్రెస్ట్ ఫీడింగ్ అంటారు
6 నెలల నుంచి 2 సంవత్సరాల వరకు- తల్లి పాలతో పాటు అనుబంధ ఆహారం తల్లులకు సపోర్ట్ "పబ్లిక్‌లో పాలు ఇవ్వడానికి సిగ్గు అనే ఆలోచన మార్చాలి ఆఫీసుల్లో బ్రెస్ట్ ఫీడింగ్ రూమ్ పనిచేసే తల్లులకు సౌకర్యం కుటుంబ సభ్యుల సహాయం తల్లికి విశ్రాంతి, మంచి ఆహారం ఇవ్వాలి,
తప్పుడు ప్రచారం వద్దు ఫార్ములా పాలు కంపెనీల ప్రకటనలను నమ్మొద్దు అని అన్నారు, ఈ కార్యక్రమంలో అంగన్ వాడి టీచర్ మమత, ఏఎన్ఎం నాగమణి, ఆశ వర్కర్స్ లక్ష్మీ, పిల్లల తలలు స్వాతి, సౌందర్య, మానస, లక్ష్మీ, చిన్నారులు పాల్గొన్నారు,

## తల్లిపాలే శిశువుకు తొలి రక్షణ...... అనంతసాగర్‌లో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.**చింతకాని మండలం, అనంతసాగర్ : తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించేందుకు అనంతసాగర్ అంగన్‌వాడీ సెంటర్-1లో శనివారం గ్రామ సర్పంచ్ జడ ప్రమీల ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు.

ఈ సందర్భంగా సర్కిల్ సూపర్వైజర్ కే. సత్యవతి మాట్లాడుతూ, శిశువు జన్మించిన వెంటనే తల్లిపాలు పట్టించడం అత్యంత అవసరమని తెలిపారు. ప్రసవం అనంతరం మొదట వచ్చే ముర్రుబాలు (కొలస్ట్రం) శిశువుకు సహజ వ్యాధినిరోధక టీకాలా పనిచేస్తాయని వివరించారు. పుట్టిన తర్వాత మొదటి ఆరు నెలల వరకు శిశువుకు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, ఆరు నెలల తర్వాత అదనపు పోషకాహారాన్ని ప్రారంభిస్తూ రెండు సంవత్సరాల వరకు తల్లిపాలు కొనసాగించాలని సూచించారు.గ్రామ సర్పంచ్ జడ ప్రమీల మాట్లాడుతూ, తల్లిపాల వల్ల శిశువు ఆరోగ్యంగా ఎదుగుతాడని, తల్లులు క్రమం తప్పకుండా తల్లిపాలు పట్టించాలని సూచించారు. అలాగే పరిసరాల పరిశుభ్రతను పాటించడం ద్వారా వ్యాధులను నివారించవచ్చని అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమంలో స్కూల్ హెడ్‌మాస్టర్ సోనీ మియా, గ్రామ సర్పంచ్ జడ ప్రమీల, సర్కిల్ సూపర్వైజర్ కే. సత్యవతి, పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావు, అంగన్‌వాడీ టీచర్ పి. ఉమా, ఆశా వర్కర్లు లక్ష్మి, స్వరూప, అలాగే గ్రామానికి చెందిన తల్లులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి, ఎస్సీ ఎస్టీ కార్పొరేషన్ చైర్మన్

**ఆగస్ట్ 01 (సీ కే న్యూస్) చేగుంట** చేగుంట ఈ ఎంపీడీవో కార్యాలయంలో చిన్నారెడ్డి అధ్యక్షతన, రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ అభివృద్ధి పథకాలను గ్రామస్థాయి నుండి పట్టణాల వరకు తీసుకువెళ్లాలి, సంక్షేమ పథకాలను ప్రజల సమస్యలను పరిష్కారం చేయాలి, సర్పంచులు అధికారులు సమన్వయంతో పని చేస్తేనే సాధ్యమవుతుందని రాష్ట్ర ఎస్సి, ఎస్టీ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు, మండల ప్రత్యేక అధికారి,హేమ భార్గవి
శనివారం ఎంపీడీఓ సమావేశ సభలో ఎంపీడీవో చిన్న రెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు..ఈ సమావేశానికి మండలం లో ఉన్న అన్ని గ్రామాల సర్పంచ్ లు, పంచాయతీ సెక్రటరీ లు సమయపాలన పాటించకపోవడం విడ్డూరంగా ఉంది, అనంతరం సమావేశంలో అధికారులు శాఖల వారిగా నివేదికను సభ దృష్టికి తీసుకువచ్చారు. ఉల్లి తిమ్మాయిపల్లి సర్పంచ్ సత్యనారాయణ మాట్లాడుతూ మా గ్రామంలో ఉన్న కరెంట్ సమస్య పై, ఏ ఈ ని అడగగా సరైన సమాధానం రాకపోవడంతో మిగతా సర్భంచులు అగ్రహం వ్యక్తం చేశారు.ముందుగా సమావేశనికి వచ్చిన చైర్మన్ బక్కి వెంకటయ్య చేగుంట మార్కెట్ కమిటీ చైర్మన్ తాడేం వెంగళ్ రావు ను శాల్వతో సన్మానం చేసారు,ఈ కార్యక్రమం లో తాసిల్దార్ బల లక్ష్మి, ఎంపీడీఓ చిన్న రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ తాడేం వెంగళ్ రావు, ఎంపీవో ప్రకాష్, రెడ్డిపల్లి సొసైటీ చైర్మన్ మ్యాకల పరమేష్, భాగయ్యా, హౌసింగ్ ఏఈ రియాజుద్దీన్, చేగుంట పట్టణ సర్పంచ్, మండల అధికారులు,వివిధ గ్రామాల సర్పంచ్ లు, పంచాయతీ సెక్రటరీ లు పాల్గొన్నారు.



## ఒక్కే ఒక ప్రాయాణం...
## చేరాలిరా క్షేమంగా గమ్యం...

- తెలంగాణ సాంస్కృతిక సారథి టీం పాట రూపంలో ప్రదర్శన్న
- కౌడిపల్లి ఎస్ ఐ అమర్ ఆధ్వర్యంలో బస్టాండ్ వద్ద అవగాహన కార్యక్రమ్మ



**సికే న్యూస్ కొల్చారం నర్సాపూర్ :**మెదక్ జిల్లా మండల కేంద్రమైన కౌడిపల్లి లో శనివారం రోజు ఉదయం తెలంగాణ సాంస్కృతిక సారథి మెదక్ జిల్లా టీం ఆధ్వర్యంలో ప్రజలకు రోడ్డు భద్రత విషయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రయాణికులు రోడ్డు ఎక్కే ముందు తీసుకోవాల్సిన తగు జాగ్రత్తల గురించి పాట రూపంలో వివరించారు. ఎస్ ఐ ఆర్ ప్రాముఖ్యత, ప్రజాస్వామ్యంలో ఓటు ప్రాధాన్యత, ఓటు ప్రాముఖ్యత 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఫామ్ నింపి ఇవ్వాలి, వాతావరణం కారణంగా ఆరుతడి పంటలు వేసుకోవాలనే, తదితర అంశాలపై వారు పాట రూపంలో ప్రజలకి వివరించారు. అనంతరం ఎస్ ఐ అమరేందర్ మాట్లాడుతూ.... ప్రయాణికులు రోడ్డు భద్రత విషయంలో తీసుకోవాల్సిన తగు అంశాలపై వివరించారు. ప్రయాణికులు రోడ్డుపై వాహనాలు నడిపేటప్పుడు వాహనానికి సంబంధించిన అన్ని పత్రాలను వెంట తీసుకురావాలని అన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పక ధరించాలి, కారులో ప్రయాణించే ప్రయాణికులు సీట్ బెల్ట్ తప్పక పెట్టుకోవాలని అన్నారు. మద్యం సేవించి ఎట్టి పరిస్థితిలో వాహనాలు నడపరాదు, మైనర్ బాల బాలికలకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రుల పై చట్టరీత్యా కేసు నమోదు చేస్తామన్నారు. రాంగ్ రూట్ లో వాహనాలు ఎట్టి పరిస్థితుల్లో నడపరాదు. అతివేగం ప్రాణానికి హానికరం,వాహనాలు అతివేగంగా ఆజాగ్రత్తగా నడిపి ఎదుటివారికి ఇబ్బంది కలిగించడమే కాకా ప్రమాదాలకు గురి కావద్దు అన్నారు. మిమ్మల్ని నమ్ముకొని తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, భార్య పిల్లలు ఉంటారు. మీరు నడిపే అజాగ్రత్త వల్ల నిండు ప్రాణాలు పోయి కుటుంబం రోడ్డున పడే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సాంస్కృతిక సారథి మెదక్ జిల్లా సభ్యులు కొమ్ముల శేఖర్ గౌడ్, నేనావత్ మదన్ సింగ్, శివొళ్లకృష్ణ, కారంగుల మాధవి, ధరావత్ రాజు,డిక్కొండ భాస్కర్, తండా బిక్షపతి, తోపాటు పోలీస్ సిబ్బంది, ప్రయాణికులు తదితరులు పాల్గొన్నారు.

## దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించిన, సర్పంచ్ ఉప సర్పంచ్

**ఆగస్టు 01 (సీ కే న్యూస్) చేగుంట** :వర్షాల కారణంగా దెబ్బతిన్న ఇండ్లను సందర్శించిన గ్రామ సర్పంచ్ ఉప సర్పంచ్ రుక్మాపూర్ గ్రామంలో ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న మరియు కూలిన ఇండ్లను గ్రామ ప్రజాప్రతినిధులు సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. సందర్శించిన బాధిత కుటుంబాలు:
షరీఫొద్దీన్ ఇల్లు మ్యాకల సుందరయ్ ఇల్లు
మ్యాకల చిన్న వెంకటి ఇల్లు ఈ ఇండ్లను సర్పంచ్ కాంచనపల్లి నవీన్, ఉపసర్పంచ్ కొలుపుల రామస్వామి, వార్డు సభ్యులు కట్ట యాదమ్మ అంజ గౌడ్, అలాగే పంచాయతీ కార్యదర్శి అక్కల బాలుసందర్శించి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.
సర్పంచ్ నవీన్ మరియు ఉపసర్పంచ్ రామస్వామి మాట్లాడుతూ:బాధితులు మనోధైర్యంతో ఉండాలి. క్రుంగిపోవద్దు. దెబ్బతిన్న, కూలిపోవడానికి ప్రమాదకర స్థితిలో ఉన్న ఇండ్లలో ఉండకూడదు. అవసరమైతే తాత్కాలికంగా కిరాయి ఇంటికి వెళ్లాలి. వర్షాలు కొనసాగుతున్న సమయంలో అవసరమైన వారికి పాఠశాలలో తాత్కాలిక నివాస సౌకర్యం కల్పిస్తాము. నష్టపోయిన వారికి ప్రభుత్వ నష్టపరిహారం అందేలా అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటాము.
ప్రతి ఇంటికి 5 మొక్కల పంపిణీ గ్రామంలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఇంటికి 5 మొక్కలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో: సర్పంచ్ కాంచనపల్లి నవీన్ ఉపసర్పంచ్ కొలుపుల రామస్వామి వార్డు సభ్యులు కట్ట యాదమ్మ అంజ గౌడ్ పంచాయతీ కార్యదర్శి అక్కల బాలు ఎఫ్.ఏ. చాకలి రామస్వామి అధికారులు, అనధికారులు, గ్రామ పెద్దలు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# స్నేహ బంధాలే సమాజానికి బలమైన పునాది

**డిజిటల్ యుగంలో మానవ సంబంధాలకు మరింత విలువ ఇవ్వాలి: డా. కాపా మురళీకృష్ణ**




**సీకే న్యూస్ ఖమ్మం ప్రతినిధి ఇస్లావత్ నరసింహ ఆగస్టు 02 2026:** స్నేహం అనేది మానవత్వాన్ని చాటిచెప్పే గొప్ప బంధమని, సమాజంలో పరస్పర విశ్వాసం, ప్రేమ, ఐక్యతను పెంపొందించే అమూల్యమైన అనుబంధమని ఫాస్ట్ జిల్లా గవర్నర్ డాక్టర్ కాపా మురళీకృష్ణ అన్నారు. నేడు అంతర్జాతీయ స్నేహ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన విడుదల చేసిన సందేశంలో జిల్లా ప్రజలకు, విద్యార్థులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు స్నేహ దినోత్సవ శు భాకాంక్షలు తెలిపారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజమైన స్నేహం సుఖదుఃఖాల్లో అండగా నిలిచి మనిషికి ధైర్యం, ఆత్మవిశ్వాసాన్ని అందిస్తుందని పేర్కొన్నారు. కుటుంబాల మధ్య, సమాజంలోని వివిధ వర్గాల మధ్య స్నేహబంధాలు ఐక్యతను బలోపేతం చేసి శాంతియుత వాతావరణం ఏర్పడేందుకు దోహదపడతాయని చెప్పారు.
విద్యార్థి దశలో ఏర్పడే స్నేహబంధాలు వ్యక్తిత్వ వికాసానికి బలమైన పునాదిగా నిలుస్తాయని, విద్యతో పాటు క్రమశిక్షణ, పరస్పర గౌరవం, సహకార భావనలను అలవర్చుకోవాలని సూచించారు. నేటి డిజిటల్ యుగంలో ప్రత్యక్ష మానవ సంబంధాలు, ఆప్యాయత, పరస్పర ఆదరణకు మరింత ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు.
ప్రేమ, స్నేహం, సేవాభావాన్ని ప్రతి ఒక్కరూ తమ జీవితంలో భాగంగా చేసుకుని సమాజ అభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చిన డాక్టర్ కాపా మురళీకృష్ణ.. ప్రతి కుటుంబంలో ఆనందం, ప్రతి స్నేహబంధంలో విశ్వాసం, ప్రతి జీవితంలో విజయాలు వెల్లివిరియాలని ఆకాంక్షిస్తూ జిల్లా ప్రజలందరికీ నేడు అంతర్జాతీయ స్నేహ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

# గణిత పరిశోదనలో పీహెచ్‌డీ సాధించిన డాక్టర్ డి. హారిత

**దర్శకుడు రాజమౌళితో ఘన సత్కారం**

**పటాన్చెరు,ఆగస్ట్ 01(సీ కే న్యూస్ ప్రతినిది):** పటాన్చెరు నియోజకవర్గంలో ముత్తంగిలోని మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ , కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్ బాలికల కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి. హారిత గణితశాస్త్రంలో ప్రతిష్టాత్మక డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ (పీహెచ్‌డీ) పట్టా సాధించి విద్యా రంగంలో మరో మైలురాయిని నెలకొల్పారు.
"ఎ ఫిక్స్‌డ్ పాయింట్ థియరీ ఇన్ జనరలైజ్డ్ మెట్రిక్ స్పేసెస్ అండ్ ఇట్స్ అప్లికేషన్స్" అనే అంశంపై ఆమె విజయవంతంగా పరిశోధన పూర్తి చేశారు. గణిత విశ్లేషణ ఫిక్స్‌డ్ పాయింట్ థియరీ రంగాల్లో ఈ పరిశోధన విశిష్టమైనదిగా గుర్తింపు పొందింది. గణితశాస్త్రంలోని పలు విభాగాలతో పాటు అనుబంధ శాస్త్రాల్లోనూ ఈ పరిశోధనకు విస్తృత అనువర్తనాలు ఉన్నాయని విద్యావేత్తలు పేర్కొంటున్నారు.
పీహెచ్‌డీ పట్టా సాధించిన సందర్భంగా డాక్టర్ హారిత తన విద్యా ప్రయాణంలో అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. పరిశోధన మార్గదర్శకులు డాక్టర్ రామ కోటేశ్వరరావు, డాక్టర్ కృష్ణకుమారి అందించిన మార్గనిర్దేశం, ప్రోత్సాహం, సహకారం తన విజయానికి ఎంతో దోహదపడిందని చెప్పారు. అలాగే ఉపాధ్యాయులు, సహచరులు, స్నేహితులు, విద్యార్థులు, శ్రేయోభిలాషుల ప్రోత్సాహాన్ని ఆమె స్మరించుకున్నారు.



ఈ విజయాన్ని తన భర్త బాలనాదంకు అంకితం చేస్తున్నట్లు తెలిపారు. తండ్రి చిన్న నర్సింహులు, తల్లి కంసమ్మ ఆశీస్సులు, కుటుంబ సభ్యుల ప్రేమ, ప్రోత్సాహం, ప్రార్థనల వల్లే ఈ విజయాన్ని సాధించగలిగానని పేర్కొన్నారు.
ఈ సందర్భంగా డాక్టర్ హారిత మాట్లాడుతూ, "ఈ పీహెచ్‌డీ కేవలం నా వ్యక్తిగత విజయం మాత్రమే కాదు. నా కుటుంబం, గురువులు, పరిశోధన మార్గదర్శకులు, సహచరులు, విద్యార్థులు, నా ప్రయాణంలో నాతో నిలిచిన ప్రతి ఒక్కరి విజయం. విద్య సమాజాన్ని మార్చగల అత్యంత శక్తివంతమైన సాధనం. నాణ్యమైన విద్య, పరిశోధన ద్వారా యువతను తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తాను" అని అన్నారు.
డాక్టర్ హారిత సాధించిన ఈ ఘనత విద్యార్థులకు, ముఖ్యంగా యువతులకు ఉన్నత విద్య, పరిశోధన, విద్యా రంగంలో రాణించేందుకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని పలువురు విద్యావేత్తలు, సహచరులు, శ్రేయోభిలాషులు అభినందనలు తెలిపారు.

# సోనాల మండలానికి తెలంగాణ పబ్లిక్ స్కూల్ (ప్రూూ) మంజూరు చేయడం హర్షణీయం -- తుల అరుణ్ కుమార్

**అదిలాబాద్ జిల్లా సికె ప్రతినిధి**
బోథ్ నియోజకవర్గంలోని సోనాల మండలానికి తెలంగాణ పబ్లిక్ స్కూల్ (ప్రూూ) మంజూరు చేయడం పట్ల రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి గారికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.
ఈ ప్రతిష్టాత్మక విద్యాసంస్థ మంజూరుకు సహకరించిన ముఖ్యమంత్రి సలహాదారు, రాజ్యసభ సభ్యులు శ్రీ వేమ్ నరేందర్ రెడ్డి గారు, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి శ్రీ జూపల్లి కృష్ణారావు గారు, ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు శ్రీ గోడం నగేష్ గారు, బోథ్ ఎమ్మెల్యే శ్రీ అనిల్ జాధవ్ గారు, మాజీ ఎంపీ శ్రీ సోయం బాపురావు గారు, డీసీసీ అధ్యక్షులు శ్రీ నరేష్ జాధవ్ గారు, బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ శ్రీ అడే గజేందర్ గారులకు నా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.
అదేవిధంగా, పార్టీలకు అతీతంగా ఈ విద్యాసంస్థ మంజూరు కోసం సహకరించిన ప్రతి ఒక్క ప్రజాప్రతినిధికి, అధికారులు, ప్రజాసంఘాలు, విద్యావేత్తలు, ప్రజలు మరియు ఈ ఉద్యమానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన ప్రతి ఒక్కరికీ నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.
సోనాల మండల ప్రజలు, విద్యార్థులు ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న ఈ విద్యాసంస్థ మంజూరు కావడం వల్ల గ్రామీణ, గిరిజన ప్రాంతాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుబాటులోకి రానుంది. ఇది బోథ్ నియోజకవర్గ విద్యాభివృద్ధిలో ఒక చారిత్రాత్మక అడుగుగా నిలుస్తుంది. ఈ ఆమోదానికి సంబంధించిన ప్రతిపాదన వివరాలు జతచేసిన పత్రంలో ఉన్నాయి.
-- తుల అరుణ్ కుమార్
ఏఐసీసీ ఇంటెలెక్చువల్ సెల్
తెలంగాణ రాష్ట్ర కోఆర్డినేటర్

## ఆర్థిక సహాయం అందజేసిన జిల్లా నాయకులు.

కసిర బోయిన లింగయ్య యాదవ్.



**సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు ఆగస్టు ఒకటి.**యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలో ఆరూరు గ్రామానికి చెందిన. మర్రినరసింహ అనారోగ్యంతో మరణించడం జరిగింది వారి కుటుంబాన్ని తుమ్మల నరసయ్య సేవా సమితి పరామర్శించడం జరిగింది వారి కుటుంబానికి కీర్తిశేషులు.తుమ్మల నరసయ్యసేవా సమితి. మత్స్యగిరి గుట్ట చైర్మన్ తుమ్మల శ్రీనివాస్.ఆధ్వర్యంలో 5,000/ వేల రూపాయలు ఆర్థిక సాయం మరియు ఆరూరు యాదవ సంఘం అధ్యక్షులు కసిర బోయిన లింగయ్య యాదవ్. వారి కుటుంబానికి10,000 వేల రూపాయలు అందజేయడం జరిగింది . కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు బండారు నరసింహారెడ్డి. వలిగొండ ఓబీసీ సెల్ అధ్యక్షులు చిలకమర్రి కనకాచారి. వార్డు మెంబర్ ఆవుల బిక్షపతి.మాజీ విద్యా కమిటీ చైర్మన్ ఆవుల అంజయ్య. మండల కాంగ్రెస్ నాయకులు ఆవుల సత్యనారాయణ. రజక సంఘం అధ్యక్షులు ఎలిమినేటి సంతోష్ కుమార్. ఆవుల స్వామి. బత్తిని వెంకటేశం.సుంకి ఆనంద్. పాండాల యాదయ్య.వల్లపు నరసింహ. సంఘీ శంకరయ్య. తదితరులు పాల్గొని శ్రద్ధాంజలి ఘటించారు.


## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు : వాకిటి అనంతరెడ్డి.





**సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు ఆగస్టు ఒకటి.**యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలో ఆరూర్ గ్రామానికి చెందిన. మర్రి నరసింహ అనారోగ్యంతో మరణించడం జరిగినది.. వారి కుటుంబాన్ని డిసిసి మాజీ ఉపాధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు వాకిటి అనంత రెడ్డి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి వారి కుటుంబ సభ్యులకు 5,000/- రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. 3వ వార్డు సభ్యుడు కసిరబోయిన మత్స్యగిరి యాదవ్. వారి కుటుంబానికి 3000/- రూపాయలు ఆర్థిక సహాయం వారి కుటుంబానికి అందజేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు యాదవ్ సంఘం మాజీ అధ్యక్షులు ఆవుల స్వామి, మత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ధర్మకర్త దామెర అంజయ్య, రేఖ మత్స్యగిరి, గొడ్డేటి మల్లేష్, మర్రి అంజయ్య కసిరబోయిన మహేష్ తదితరులు పాల్గొని వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## విద్యార్థిపై ఉపాధ్యాయుడి దాడి?.. కేసు నమోదు




**సీకే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం ఆగస్టు 01 2026:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రామవరం ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో ఏడో తరగతి విద్యార్థి భుక్య తమన్ తేజ్‌పై తెలుగు ఉపాధ్యాయుడు రాజేందర్ రెడ్డి దాడి చేశాడనే ఆరోపణలు వెలువడ్డాయి. ఈ ఘటనలో విద్యార్థికి గాయాలైనట్లు తల్లిదండ్రులు పేర్కొన్నారు.
ఈ ఘటనపై బాధ్య ఉపాధ్యాయుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి తల్లిదండ్రులు టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.
మరోవైపు, ఘటనపై పాఠశాల యాజమాన్యం కూడా అంతర్గత విచారణ చేపట్టింది. విద్యార్థి, ఉపాధ్యాయుడు, సంబంధిత సిబ్బంది నుంచి వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం. విచారణలో వాస్తవాలు తేలిన అనంతరం నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని అధికారులు పేర్కొన్నట్లు తెలిసింది.
ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశమవగా, విద్యార్థుల భద్రత విషయంలో నిర్లక్ష్యం తగదని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## నిరుపేదల గుండెల్లో నిలిచిన నాయకుడు స్వామిగౌడ్

**సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి దండి సురేష్ .**




**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.**చింతకాని : నిరుపేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన నాయకుడు దూసరి స్వామిగౌడ్ అని సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి దండి సురేష్ తెలిపారు శుక్రవారం రాత్రి నేరడ గ్రామంలో జరిగిన స్వామిగౌడ్ 24వ వర్ధంతి సభలో సురేష్ మాట్లాడుతూ హైదరాబాద్ నుండి చింతకాని మండలం నేరడ గ్రామంలో స్వామిగౌడ్ అడుగు పెట్టిన రోజుల్లో అగ్రవర్ణాల చేతుల్లో నలిగిపోతున్న నిరుపేదలను చూసి చలించిపోయారన్నారు కమ్యునిస్టు సిద్ధాంతాలను ఆచరిస్తూ పెత్తందారులను ఎదిరించి వందల ఎకరాల బంజర భూములను పేదలకు పంచి పెట్టిన ఘనత స్వామిగౌడ్ నిరుపేద విద్యార్థులు చదువుకునేందుకు గ్రామంలో పాఠశాల నిర్మించి విద్యావకాశాలు కల్పించిన మహానుభావుడు స్వామిగౌడ్ అన్నారు. గ్రామ సర్పంచ్ గా ప్రజలకు ఎనలేని సేవలు అందిచారన్నారు. స్వామిగౌడ్ స్ఫూర్తితో నిరుపేదలకు అండగా వారి సమస్యల పరిష్కారం కోసం నేటికి వారి కుటుంబ సభ్యులు శ్రీరాములు, నేతాజీ, గోపాలరావు కళ్యాణ్ లు పనిచేస్తున్నారన్నారు. నేడు సర్పంచ్ గా నేతాజీ గ్రామాభివృద్ధికి ఎనలేని కృషి చేస్తున్నారన్నారు అనంతరం స్వామి గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి,జిల్లా కార్యవర్గ సభ్యులు పావులూరి మల్లికార్జునరావు సిపిఐ జిల్లా సమితి సభ్యులు దూసరి శ్రీరాములు మండల కార్యదర్శి దూసరి గోపాలరావు గ్రామసర్పంచ్ దూసరి నేతాజీ గ్రామ ఉపసర్పంచ్ కోట బాలేష్ వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి గోగుల ఆది గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు మంకెన నాగేశ్వరరావు సిపిఐశాఖ కార్యదర్శి షేక్ దస్తగిరి,మట్టా రవి కాటిరాల మహేష్ గూనుగుంట్ల వెంకన్న అమడాల వెంకటేష్ దోని వెంకన్న రాగం లింగరాజు కొల్లి సతీష్ సైదా గోగుల వెంకట్రావు ప్రవీణ్ కోట వీరయ్య అంతోని జి నవీన్ బత్తుల కృష్ణ పులిపాటి లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా సర్పంచ్ బాలకృష్ణ నాయుడు 38వ జన్మదిన మహోత్సవం...







**గద్వాల ప్రతినిధి: ఆగస్టు 01:**జోగులాంబ గద్వాల జిల్లా, ఘట్టు మండలం ఆరగిద్ద గ్రామ ప్రథమ పౌరుడు, కాంగ్రెస్ పార్టీ యువనేత బాలకృష్ణ నాయుడు 38వ జన్మదిన వేడుకలు రాజకీయ వర్గాల కోలాహలం మధ్య అట్టహాసంగా జరిగాయి. గద్వాల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ వేడుకలకు పార్టీ శ్రేణులు, అభిమానులు, ప్రజాప్రతినిధులు భారీ సంఖ్యలో తరలివచ్చారు.

?? సరితమ్మ ఆశీస్సులు – ఘన సత్కారం

ఆధ్వర్యం: రాష్ట్ర గొర్రెలు మరియు మేకల అభివృద్ధి సహకార సమాఖ్య చైర్‌పర్సన్ మరియు నియోజకవర్గ ఇంచార్జ్ సరిత తిరుపతయ్య కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అభిమానుల సమక్షంలో స్వయంగా ఈ వేడుకలను ముందుండి నడిపించారు.

కేక్ కటింగ్: సరిత తిరుపతయ్య అభిమానుల కార్యకర్తల సమక్షంలో సర్పంచ్ బాలకృష్ణ నాయుడు కేక్ కట్ చేసి తన జన్మదిన వేడుకలను జరుపుకున్నారు.

శుభాకాంక్షల వెల్లువ: ఈ సందర్భంగా సరిత తిరుపతయ్య అభిమానులు కార్యకర్తలు సర్పంచ్‌కు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి ప్రత్యేకంగా అభినందించారు. బాలకృష్ణ నాయుడు ప్రజాసేవలో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, ఆయన ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

# ప్రతి ఒక విద్యార్థి ఉన్నతమైన లక్ష్యంతో చదవాలి....

**ప్రభుత్వ పాఠశాల చదువుకున్న విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదుగుతారు...**

**పీయం జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 40 లక్షల వ్యయంతో అదనపు తరగతి గదులు, సైన్స్ లాబ్ ప్రారంభించిన ఎమ్మెల్యే ...**



**సి కె న్యూస్ ప్రతినిధి గద్వాల** ఈరోజు గద్వాల నియోజకవర్గం లోని మల్దకల్ మండల కేంద్రంలో పి ఎం సి జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 40 లక్షల వ్యయంతో నిర్మాణమైన అదనపు తరగతి గది, సైన్స్ ల్యాబ్ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా లిఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి లిఅదనపు కలెక్టర్ నర్సింగ్ రావు హాజరయ్యారు....

ఎమ్మెల్యేకీ నాయకులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పుష్పగుచ్చం ఇచ్చి ఘనంగా స్వాగతం పలికారు ..

అదనపు తరగతి గదులను సైన్స్ ల్యాబ్ ను ఎమ్మెల్యే గారు, అదనపు కలెక్టర్ గారు రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించడం జరిగింది..

గ్రామీణ ప్రాంతాల నుండి మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు ఎమ్మెల్యే సమక్షంలో జిల్లా సీనియర్ నాయకులు పటేల్ ప్రభాకర్ రెడ్డిచే విద్యార్థులకు దాత సైకిల్ పంపిణీ త్వరలోనే అందజేస్తామని ప్రకటించారు.

పాఠశాల అభివృద్ధి లో భాగంగా తరగతి గదులను ప్లాస్టింగ్ కోసం ౹రాజా ఛైర్మెన్ తిమ్మారెడ్డి తన వంతు సహకారం అందజేస్తానని తెలిపారు..

ఎమ్మెల్యే మాట్లాడుతూ....

గద్వాల నియోజకవర్గం లో మల్దకల్ కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్న పాఠశాల చదువుకుంటున్న విద్యార్థులు మండల టాపర్ పదవ తరగతి ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు హార్దిక శుభాకాంక్షలు తెలిపారు.

గ్రామీణ ప్రాంతం నుండి పేద మధ్యతరగతి విద్యార్థులు ప్రభుత్వం చదువుకోవడం జరుగుతుంది. ప్రభుత్వ పాఠశాలలు చదివితే విద్యార్థులకు ప్రైవేట్ పాఠశాల దీటుగా ఉపాధ్యాయులు అందించడం జరుగుతుంది.

ప్రభుత్వ పాఠశాలలో అత్యధిక విద్యార్థులు గల రాష్ట్రంలోని నాలుగు పాఠశాలలు మల్దకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గద్వాల లో ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ప్రభుత్వ బాలుర ఉన్నంత పాఠశాల ప్రభుత్వ అభ్యున్నత పాఠశాల ధరూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో చదువుకోవడం జరుగుతుంది ఇక్కడ చదువుకునే విద్యార్థులకు అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తూ విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా విష విధంగా కృషి చేయడం జరుగుతుందని తెలపారు.

ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు ఎంతోమంది వివిధ రంగాల ప్రభుత్వ ఉద్యోగాలలో అత్యున్నత స్థానాలలో ఉన్నారు. నేను కూడా ప్రభుత్వ పాఠశాలలో చదువుకొని ప్రభుత్వ జూనియర్ కాలేజ్ చదువుకొని నేడు ఎమ్మెల్యేగా ఉన్నాను. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వం పాఠశాల చదివించాలి ప్రభుత్వ పాఠశాలలు మంచి విద్యను అందజేయడం జరుగుతుంది. అని పేర్కొన్నారు.

గ్రామీణ ప్రాంతంలోని విద్యార్థులు దూర ప్రాంతాలకు వెళ్లే చదువుకోవడం అవసరం లేకుండా గద్వాలలోని మెడికల్ కాలేజీ నర్సింగ్ కాలేజీ ఏర్పాటు చేయడం జరిగింది. అదేవిధంగా త్వరలో ఎంబీఏ కాలేజీ కూడా మంజూరు చేసే విధంగా ప్రయత్నం చేస్తా అదే విధంగా

కె. టి దొడ్డి మండలంలో యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూలు మంజూరు కావడం జరిగింది పనులు కొనసాగుతున్నాయి అని పేర్కొన్నారు.

మీరు కూడా మంచిగా చదువుకొని భవిష్యత్తులో అత్యున్నత స్థాయికి ఎదిగి మీ తల్లిదండ్రులకు మీ పాఠశాలకు మీ గ్రామానికి గద్వాల నియోజకవర్గానికి మంచి పేరు ప్రతిష్టలుతీసుకురావాలని కోరారు.

పాఠశాల అభివృద్ధికి నా వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని తెలిపారు.

ఈ కార్యక్రమంలో౹రాజా ఛైర్మెన్ తిమ్మారెడ్డి, మాజీ జిల్లా గ్రంథాలయ మాజీ ఛైర్మెన్ రామన్ గౌడ్, జిల్లా సీనియర్ నాయకులు పటేల్ ప్రభాకర్ రెడ్డి విక్రమ్ సింహారెడ్డి, మాజీ ఎంపీపీలు రాజారెడ్డి, విజయ్, జిల్లా సర్పంచులు సంఘం అధ్యక్షుడు రాజశేఖర్, మాజీ వైస్ ఎంపీపీ వీరన్న, ఆలయ వ్యవస్థాపక చైర్మన్ ప్రహల్లాద రావు సర్పంచ్, సింగల్ విండో వైస్ చైర్మన్ విష్ణు, వివిధ గ్రామాల సర్పంచులు, నాయకులు అజయ్ వెంకటన్న, చంద్రశేఖర్ రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, నరేందర్, మధునాయకి, యాకోబ్, నర్సింహులు రాముడు, రాజు, తిమ్మరాజు, పరశురాముడు, ప్రవీణ్, తిమ్మప్ప, మహేష్, బద్రి, నాయకులు, కార్యకర్తలు, ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల ఫీజు బకాయిలు విడుదల చెయ్యాలి.



**సంఘం నాయకులు.**

**సికే న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు ఆగస్టు ఒకటి.** భువనగిరిలో వేలాదిమంది విద్యార్థులు మహాధర్నాలి

10 వేల కోట్లు విద్యార్థుల ఫీజు బకాయిలు వెంటనే విడుదల చేయాలి జీవో నెంబర్ 9, ఆర్ఆర్ యాక్ట్ ను రద్దు చేయాలి

విద్యార్థుల స్కాలర్షిప్ల మీద రాజ్యసభ ఎంపీ ఆర్ కృష్ణన్న మీద చేసిన వ్యాఖ్యలు వెంటనే సీఎం రేవంత్ రెడ్డి వెనక్కి తీసుకోవాలి

ప్రభుత్వ నాయకులు కమిషన్లు రావనే విద్యార్థుల స్కాలర్షిప్లు ఇవ్వట్లేదు

పల్లగొర్ల మోదీరాందేవ్

భువనగిరి : విద్యార్థులకు రావలసిన 10వేల కోట్ల ఫీజు బకాయిలు విడుదల చేయాలని జీవో నెంబర్ 9ను ఆర్ఆర్ యాక్ట్ రద్దు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీలో చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని వేల మంది విద్యార్థులతో భువనగిరిలో మహా ధర్నా రోడ్లన్నీ విద్యార్థులతో నిండిపోయాయి వందలాది మంది పోలీసులు, విద్యార్థి నాయకులు బస్సుల పైకెక్కి నినాదాలు తదినంతరం శాంతియుతంగా ధర్నా ముగించారు బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ పల్లగొర్ల మోదీరాందేవ్, మాట్లాడుతూ

విద్యార్థులకు రావలసిన 10 వేలకోట్ల స్కాలర్షిప్ ఫీజు బకాయిలు ఇవ్వకుండా పేద విద్యార్థులను విద్యకు దూరం చేస్తుంది ఈ ప్రభుత్వం, విద్యార్థులకు వ్యతిరేకంగా తెచ్చిన జీవో నెంబర్ 9ను ఆర్ఆర్ యాక్ట్ రద్దు చేయాలి, పూర్తి ఫీజులను ప్రభుత్వమే భరించాలి పాత పద్ధతిలోనే విద్యార్థులకు బకాయిలు చెల్లించాలి విద్యాశాఖ మంత్రిని నియమించి వెంటనే విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి విద్యార్థుల స్కాలర్షిప్ల మీద రాజ్యసభ ఎంపీ ఆర్ కృష్ణన్న మీద చేసిన వ్యాఖ్యలు సీఎం రేవంత్ రెడ్డి వెనక్కి తీసుకోవాలి ,,

మూసి సుందరీకరణ ఫోర్త్ సిటీకి లక్షల కోట్లు ఉంటాయి గాని విద్యార్థులకు ఇవ్వడానికి ప్రభుత్వం దగ్గర డబ్బులు ఉండయా, ప్రభుత్వం స్కాలర్షిప్లు ఇవ్వక విద్యార్థులు అయోమయానికి గురవుతున్నారు కాలేజ్ యజమాన్యాలు ఫీజులు కడితేనే సర్టిఫికెట్లు ఇస్తామని విద్యార్థులను వేధిస్తున్న ఈ ప్రభుత్వానికి ఏమాత్రం పట్టించుకోవడం లేదు రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజా సమస్యలను పూర్తిగా విస్మరించింది అన్నారు ఇంజనీరింగ్ ఎంబీఏ ఎంసీఏ చదివే విద్యార్థులకు పూర్తి ఫీజు ప్రభుత్వమే భరించాలి సంక్షేమ హాస్టల్లకు సొంతభవనాలు నిర్మించాలి అప్లై చేసుకున్న ప్రతి ఒక్కరికి ఓవర్సీస్ స్కాలర్షిప్ ఇవ్వాలి మెస్ చార్జీలు పెంచాలి కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో పెట్టిన విద్యార్థులకు 5 లక్షల భరోసా కార్డు ఇవ్వాలి 100రోజుల్లోనే విద్యార్థుల సమస్యలు పరిష్కరిస్తామని అధికారంలోకి వచ్చాక విద్యార్థుల చావులపై పేలాలు ఏరుకుంటుంది ప్రభుత్వం 100 రోజుల్లో రాజీవ్ గాంధీ ఇంద్రగాంధీ విగ్రహాలు తప్ప రాష్ట్రంలో ఎలాంటి మార్పు లేదు హాస్టలకు సొంత భవనాలులేవు ఉన్న అద్దె కొంపలకు బెచ్చులాడి విద్యార్థులు చనిపోయే ప్రమాదం ఉన్న ఈ ప్రభుత్వం నిమ్మకు నీరు ఎత్తినట్లుగా వ్యవహరిస్తుంది ఆర్ కృష్ణన్న కొట్లాడి విద్యార్థుల కోసం పూర్తి ఫీజులను ప్రభుత్వమే భరించే విధంగా పెట్టిస్తే ఆ జీవోను తుంగలోకి తొక్కి ఈ ప్రభుత్వం ట్రస్ట్ బ్యాంక్ పెడతామని బెదిరిస్తుంది ఇక ఊరుకునే ప్రసక్తే లేదు ఈ ప్రభుత్వం వెంటనే విద్యార్థుల ఫీజు బకాయిలను విడుదల చేయాలి పెంచిన ఫీజులన్నీ ప్రభుత్వమే భరించాలి ఖాళీగా ఉన్న ఉద్యోగాలు భర్తీ చేయాలి విద్యారంగానికి నిధులు కేటాయించాలని లేనియెడల పెద్ద ఎత్తున వీ ఆర్ కృష్ణన్న ఆధ్వర్యంలో ధర్నాలు రాస్తారోకోలు బస్సులు దానాలు చేసి ప్రభుత్వని అట్టుడికిస్తామని హెచ్చరిస్తున్నాం ఈ సమావేశంలో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ పల్లగొర్ల మోదీరాందేవ్, బీసీ సంఘం నాయకులు పల్లపు దుర్గయ్య, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి సాయిలు, విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వేముల అనిల్,చిల్లర యశ్వంత్,జినుకల జస్వంత్,అరుణ్,ప్రవీణ్,శివ, లవ్దే రామ్ చరణ్ నాయక్ ,లింగస్వామి, శ్రీకాంత్, హరీష్, దామోదర్, ప్రశాంత్, లోకేష్, మానస,సంతోష, శైలజ, విగ్నేశ్వరి, మౌనిక, సాత్విక,తదితరులు పాల్గొన్నారు

## కాంట్రాక్ట్ కృష్ణారెడ్డి సతీమణి యశోదమ్మ పార్థివదేహాన్ని పూలమాలవేసి నివాళులర్పించిన ఎమ్మెల్యే ....



**సి కె న్యూస్ ప్రతినిధి గద్వాల :**ఈరోజు గద్వాల నియోజకవర్గంలోని మల్దకల్ మండలం పరిధిలోని బిజ్వారం గ్రామం చెందిన కాంట్రాక్టర్ కృష్ణారెడ్డి సతీమణి యశోదమ్మ మృతి చెందారు ఈ విషయం తెలిసిన వెంటనే లిలిఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి వారి స్వగృహం చేరుకుని ఆయె పార్థివ దేహానికి పూలమాలవేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించడం జరిగినది.

ఎమ్మెల్యే వెంటనే మాజీ జిల్లా గ్రంథాలయ చైర్మన్ జంబురామన్ గౌడ, మాజీ ఎంపీపీలు రాజారెడ్డి, విజయ్, జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు రాజశేఖర్, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ మార్కెట్( సంత) సముదాయం షాప్ లను ప్రారంభించిన ఎమ్మెల్యే గారు....



**సి కె న్యూస్ ప్రతినిధి గద్వాల** ఈరోజు గద్వాల నియోజకవర్గంలోని మల్దకల్ మండలం కేంద్రంలో నాబార్డ్ వారి చే 20 లక్షల వ్యయం తో నిర్మాణమైన గ్రామీణ మార్కెట్ (సంత) సముదాయం షాప్ ను ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగ్ రావు హాజరయ్యారు.

గ్రామీణ మార్కెట్ (సంత) సముదాయపు షాప్ లను ఎమ్మెల్యే రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించడం జరిగింది..

ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు జిల్లా సీనియర్ నాయకులు, నాయకులు, కార్యకర్తలు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బావిలో పడిన వ్యక్తి మృతి: నేతివానిపల్లి తాండాలో విషాదం.

**మల్దకల్ ఆగస్టు 01:** జోగులంబ గద్వాల జిల్లా మల్దకల్ మండల పరిధిలోని నేతవానిపల్లి తాండ గ్రామంలో బావిలో పడి ఒక యువకుడు మృతి చెందిన విషాద సంఘటన నేతివానిపల్లి తాండాలో చోటుచేసుకుంది. స్థానికులు మరియు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... తాండాకు చెందిన వెంకటేష్ నాయక్ అనే యువకుడు శుక్రవారం సాయంత్రం సుమారు 7:30 నిమిషాల సమయంలో ప్రమాదవశాత్తు గ్రామ సమీపంలో ఉన్న ఒక బావిలో పడిపోయాడు. ఈ సంఘటన గురించి తెలిసిన వెంటనే గ్రామస్థులు పోలీసు అధికారులకు వివరించి చెప్పారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బావి నుండి వెలికితీశారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు. వెంకటేష్ నాయక్ హఠాన్మరణంతో నేతివానిపల్లి తాండాలో విషాద ఛాయలు అలముకున్నాయి.





# భారత్ మాల 214/ 100 రాయపురం స్టేజి దగ్గర అప్రోచ్ కనెక్షన్ మరియు అండర్ పాస్ బ్రిడ్జ్ కోసం రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న గట్టు మండలం ప్రజలు ..



**భారత్ మాల గట్టు మండల అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేసిన ఎమ్మెల్యే ..**

**భారత్ మాల అప్రోచ్ రోడ్డు కోసం167రోజు రిలే నిరాహార దీక్ష చేసి వారి దీక్ష విరమణ చేయించి నిమ్మరసం అందజేసిన ఎమ్మెల్యే ...**

సి కె న్యూస్ ప్రతినిధి గద్వాల

ఈరోజు గద్వాల నియోజకవర్గం లో గట్టు మండలం రాయపురం స్టేజ్ దగ్గర గట్టు మండలం భారత్ మాల అప్రోచ్ రోడ్డు నిర్మాణాలకు కొరకు 167 రోజులు దీక్ష చేసిన రాయపురం గ్రామస్తులకు దీక్షను విరమించి నిమ్మరసం ను అందజేసి భారత్ మాల రోడ్డు గట్టు మండలం అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి గారు భూమి పూజ చేసి పనులను ప్రారంభించడం జరిగింది.

భరత్ మాల గట్టు మండలం లోని అప్రోచ్ రోడ్డు నిర్మాణం కొరకు 167 రోజులు మాజీ సింగల్ విండో చైర్మన్ రాముడు ఆధ్వర్యంలో గ్రామస్తులు మండలంలోని ప్రజలు ప్రతిరోజు రిలే నిరాహార దీక్షను చేసి చివరికి రోడ్డు నిర్మాణం ఎమ్మెల్యే సహకారంతో సాధించుకోవడం జరిగింది.

ఎమ్మెల్యే మాట్లాడుతూ ...

గద్వాల నియోజకవర్గంలో గట్టు మండలంలో భారత్ మాల రోడ్డు నిర్మాణం కావడంతో గట్టు మండలంలోని రాయపురం స్టేజి దగ్గర అప్రోచ్ రోడ్డు నిర్మాణం కొరకు గ్రామస్తులు 167 రోజులపాటు రిలే నిరాహార దీక్షను చేయడం జరిగింది.

గద్వాల నియోజకవర్గం గట్టు మండల అభివృద్ధి కొరకు ఈ ప్రాంతంలోని భారత్ మాల వంటి రహదారి నిర్మాణం పనులు కావడంతో ఈ ప్రాంతం నుండి మైసూర్ పూనే వరకు రోడ్డు నిర్మాణం ఇటు తమిళనాడు వరకు రవాణా సౌకర్యం ఏర్పడుతుంది ఈ ప్రాంతం అభివృద్ధి అవుతుందని దురదృష్టతో ఆలోచించి అధికారులతో దృష్టికి తీసుకెళ్లి ఈ రోడ్డు నిర్మాణముకు కృషి చేయడం జరిగింది.

భవిష్యత్తులో తెలంగాణ కర్ణాటక తమిళనాడు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో రహదారి లకు వెళ్లడానికి సులభం అవుతుంది అదేవిధంగా వ్యాపార సంబంధాలు అభివృద్ధి చెందుతాయి అదేవిధంగా రైతులు పంటలను ఇతర ప్రాంతాలకు తీసుకువెళ్లి దిగుమతి చేయడం వల్ల రైతుల కూడా ఆర్థికంగా అభివృద్ధి చెందారు అదేవిధంగా ఈ ప్రాంతంలో ఇండస్ట్రీలు రావడం జరుగుతుంది . ఇండస్ట్రీ రావడంతో యువతకు ఉద్యోగ అవకాశాలు కూడా వచ్చే అవకాశం ఉన్నది కాబట్టి ఈ మార్గంలో అప్రోచ్ రోడ్డును ఏర్పాటు చేయాలని భారత్ మాల అధికారులతో మాట్లాడి ప్రభుత్వంతో దృష్టికి తీసుకెళ్లి మంత్రుల దృష్టికి తీసుకెళ్లి ఈ రోడ్డును మంజూరు చేయడం జరిగిందని తెలిపారు.

ఇటీవలే భారత్ మాల రోడ్డు సమీపం లో రాయపురం స్టేజి దగ్గర 133 హై టెన్షన్ సబ్స్టేషన్ మంజూరు కావడం జరిగింది. వాటిని కూడా 220 హై టెన్షన్ సబ్ స్టేషన్ గా మార్చే విధంగా ప్రయత్నం చేయడం జరుగుతుంది. దీనితో ఈ ప్రాంతంలో విద్యుత్ సమస్యను కొంతమేరకు తగ్గించడం జరుగుతుంది రైతులకు 24 గంటల కరెంటు లభిస్తుందని పేర్కొన్నారు.

లెనోవా ప్రభావం వల్ల ఈ సంవత్సరం వర్షపాతం తక్కువగా ఉన్నది అయినా కూడా రైతులకు ఎలాంటి నీటి సమస్య ఉండకుండా ఉండాలని నీటిని నిలువ ఉంచడం జరిగింది రైతులకు రెండు పంటలకు నీళ్లు అందించే విధంగా కృషి చేస్తానని తెలిపారు.

భవిష్యత్తులో గట్టు మండలాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసే విధంగా నా వంతు సహాయశక్తుల కృషి చేస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ చైర్మన్ హనుమంతు రాజు వైస్ చైర్మన్ వెంకటేష్, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ జంబురామన్ గౌడ, మాజీ ఎంపీపీ విజయ్ జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు రాజశేఖర్, సర్పంచ్, మాజీ సింగల్ విండో రాముడు నాయకులు గద్వాల తిమ్మప్ప, సిద్ది రామప్ప అలీ, శ్రీనివాస్ రెడ్డి, సంతోష్ కృష్ణ, రాజప్ప గౌడు, రామకృష్ణ నాయడు,మధుసూదన్ రెడ్డి, గోవిందు సిద్దు, ఆనంద్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నిబద్ధతకు నిలువెత్తు నిదర్శనం....బసిరెడ్డి సత్యనారాయణ రెడ్డి

- **అడికిచెర్ల ఉన్నత పాఠశాలలో వైభవంగా బసిరెడ్డి సత్యనారాయణ రెడ్డి ఉద్యోగ విరమణ అభినందన సభ**
- **ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెచ్చిన బసిరెడ్డి సత్యనారాయణ రెడ్డి**
- **150 కిలోమీటర్ల ప్రయాణం.....31 ఏళ్ల విద్యాసేవ**
- **సమయపాలన, సేవాభావానికి ప్రతీకగా నిలిచిన ఉపాధ్యాయుడు బసిరెడ్డి సత్యనారాయణ రెడ్డి**
- **విద్యాబోధనలో ఆదర్శంగా నిలిచిన బసిరెడ్డికి ఘన సన్మానం**
- **31 ఏళ్ల బసిరెడ్డి సత్యనారాయణ రెడ్డి అంకితభావానికి అపూర్వ గౌరవం**

సికే న్యూస్ పెద్దేముల్ ప్రతినిధి ఉద్యోగ జీవితంలో ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ అనేది సహజమైన ఘట్టమే అయినప్పటికీ, సమాజానికి ఆదర్శప్రాయమైన సేవలు అందించిన వారి సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయని పెద్దేముల్ మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) నర్సింగ్ రావు,వికారాబాద్ జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి రామ్ మస్తా,అడికిచర్ల గ్రామ సర్పంచ్ మ్యాతరి యశోద, మాజీ ఎంపీటీసీ ధన్ సింగ్,అడికిచెర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాండురంగం లు పేర్కొన్నారు.శనివారం అడికిచెర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ సైన్స్ స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన బసిరెడ్డి సత్యనారాయణ రెడ్డికి ఘనంగా ఉద్యోగ విరమణ అభినందన సభను నిర్వహించారు. పాఠశాల ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు,విద్యార్థులు తల్లిదండ్రులు,అడికిచెర్ల గ్రామస్తులు,కుటుంబ సభ్యులు పాల్గొని ఆయనను శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ...బసిరెడ్డి సత్యనారాయణ రెడ్డి ప్రభుత్వ ఉపాధ్యాయునిగా దాదాపు 31 సంవత్సరాల పాటు అంకితభావం, క్రమశిక్షణ, నిబద్ధత, ఆత్మవిశ్వాసంతో సేవలందించి ఎంతో మంది విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేసిన ఆదర్శ ఉపాధ్యాయుడిగా గుర్తింపు పొందారని కొనియాడారు. ప్రతిరోజూ సుమారు 150 కిలోమీటర్ల దూరం ప్రయాణించి, పాఠశాల ప్రార్థన సమయానికే హాజరై విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు కృషి చేశారని ప్రశంసించారు.వ్యవసాయ కుటుంబంలో జన్మించిన ఆయన 1995 జూన్ 11న ఉపాధ్యాయ వృత్తిలోకి ప్రవేశించి, తన ఉద్యోగ జీవితమంతా విద్యార్థుల అభివృద్ధియే లక్ష్యంగా పెట్టుకుని పనిచేశారని తెలిపారు.ఆయన బోధన, క్రమశిక్షణ,నిబద్ధత,ఆత్మ విశ్వాసం,అంకితభావం,సేవా దృక్పథం ప్రతి ఉపాధ్యాయుడికి ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు.కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ, బసిరెడ్డి సత్యనారాయణ రెడ్డి పదవీ విరమణ పొందుతున్నప్పటికీ, ఆయన అందించిన విద్యాసేవలు, విలువలు, మార్గదర్శకత్వం విద్యార్థులు, సహచర ఉపాధ్యాయుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని అభినందించారు.

పదవీ విరమణ సభలో భావోద్వేగంగా బసిరెడ్డి సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ...........

ఉద్యోగ విరమణ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభలో పదవీ విరమణ పొందుతున్న ఫిజికల్ సైన్స్ స్కూల్ అసిస్టెంట్ బసిరెడ్డి సత్యనారాయణ రెడ్డి భావోద్వేగంగా ప్రసంగించారు. తాను వ్యవసాయ కుటుంబంలో పుట్టి పెరిగి చిన్ననాటి నుంచే చదువులపై ఆసక్తి పెంచుకుని, ఎంతో కష్టపడి చదివి 1995 జూన్ 11న ఉపాధ్యాయ వృత్తిలోకి ఎస్జీటీ గా అడుగుపెట్టానని తెలిపారు.తన ఉద్యోగ జీవితమంతా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా పనిచేశానని చెప్పారు.

2001లో పదోన్నతి పొంది మోమిన్ పేట్ బాలుర ఉన్నత పాఠశాలకు బదిలీ అయ్యానని, అనంతరం దాదాపు 15 సంవత్సరాల పాటు ప్రధానోపాధ్యాయుడిగా సేవలందించే అవకాశం లభించిందని పేర్కొన్నారు.ప్రతిరోజూ సుమారు 150 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తూ,ప్రతి రోజు ఉదయం 5:15 నిముషాలకు ఇంటి నుండి బయలుదేరి రాత్రి 8 గంటలకు ఇంటికి తిరిగి వెళుతూ ప్రతి రోజు పాఠశాల ప్రార్థన సమయానికే హాజరై ఉత్సాహంగా విద్యార్థులకు పాఠాలు బోధించడం తనకు ఎంతో సంతృప్తిని ఇచ్చిందని అన్నారు.

అడికిచెర్ల ప్రాంతం తన హృదయంలో ప్రత్యేక స్థానం సంపాదించుకుందని, ఇక్కడి విద్యార్థుల, గ్రామస్తుల ప్రేమాభిమానాలు,ఆప్యాయతలు జీవితాంతం మరువలేనివని భావోద్వేగంతో చెప్పారు.31 సంవత్సరాల ఉపాధ్యాయ జీవితంలో వేలాది మంది విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పే అవకాశం దక్కడం తన అదృష్టమని పేర్కొన్నారు.

అడికిచెర్ల ఉన్నత పాఠశాలలో సహచర ఉపాధ్యాయులు కుటుంబ సభ్యుల్లా కలిసి పనిచేస్తున్నారని, ప్రధానోపాధ్యాయులు పాండురంగం తన అద్భుతమైన పరిపాలనా నైపుణ్యాలతో పాఠశాలను విజయవంతంగా ముందుకు నడిపిస్తున్నారని ప్రశంసించారు.




చివరగా, తన 31 ఏళ్ల ఉద్యోగ జీవితంలో తనకు అండగా నిలిచిన స్నేహితులు,ఆత్మీయులు,అభిమానులు, సహచర ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థుల తల్లిదండ్రులు, యువజన సంఘాల నాయకులు, అడికిచెర్ల ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల, ఊరేంటి తండా ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది అందరికీ పేరుపేరునా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.వారి సహకారం వల్లే తన ఉద్యోగ జీవితాన్ని విజయవంతంగా పూర్తి చేయగలిగానని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అడికిచర్ల గ్రామ సర్పంచ్ మ్యాతరి యశోద అనందం,ఉప సర్పంచ్ ఎల్లప్ప,మాజీ ఎంపీటీసీ ధన్ సింగ్,పెద్దేముల్ మండల ఎంఈఓ నర్సింగ్ రావు, వికారాబాద్ జిల్లా అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ రామ్ మస్తా,తట్టేపల్లి కాంప్లెక్స్ హెచ్ఎం జోజప్ప,అడికిచర్ల ప్రధానోపాధ్యాయులు పాండు రంగం,ఊరేంటి తండా ప్రధానోపాధ్యాయులు వినయ్,పెద్దేముల్ మండల శాఖ పీఆర్టీయూ ప్రెసిడెంట్ పోల నవీన్ కుమార్, ప్రధాన కార్యదర్శి బక్క వెంకట్ రెడ్డి,ఉపాధ్యాయులు బందెప్ప,యూటీఎఫ్ నాయకులు సలీం,గ్రామ పెద్దలు వెంకట్ రెడ్డి,మాజీ ఉపసర్పంచ్ ఫకృద్దీన్,మాజీ ఎస్ఎంసీ చైర్మన్ మహబూబ్,ఏఏపీసీ చైర్మన్ హేమలత,పంచాయతీ కార్యదర్శి మొగులేష్,ఆయా గ్రామ పంచాయతీల వార్డు సభ్యులు,స్థానిక నాయకులు, ప్రజా ప్రతినిధులు, బసి రెడ్డి సత్యనారాయణ రెడ్డి స్నేహితులు, బంధువులు, కుటుంబ సభ్యులు,విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు,అడికిచర్ల గ్రామస్థులు,సహచర ఉపాధ్యాయులు,తదితరులు పాల్గొన్నారు.

# తప్పట్ల మోరుసు ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల అద్భుత రికార్డు...

**సర్పంచ్ ఆశీర్వాదం విద్యార్థులకు ఘన సన్మానం..**

జోగులాంబ గద్వాల జిల్లా గట్టు మండలం తప్పట్ల మురుసు గ్రామంలో విద్యార్థులు ఒకే నెలలో 26 రోజులూ హాజరైన ప్రతిభావంతులకు సర్పంచ్ ఆశీర్వాదం ఘన సన్మానం.

విద్యార్థులలో క్రమశిక్షణ, నిరంతర విద్యాభ్యాస పటిమను పెంపొందించడమే ధ్యేయంగా స్థానిక తప్పట్లమూర్సు ప్రభుత్వ పాఠశాలలో ఒక వినూత్న విద్యా పురస్కార కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. ఒకే మాసంలో పాఠశాల నిర్వహించిన మొత్తం 26 పనిదినాల పాటు ఒక్క రోజు కూడా విరామం తీసుకోకుండా, వంద శాతం (100%) హాజరును నమోదు చేసుకుని అపూర్వ రికార్డు సృష్టించిన విద్యార్థులను, వారిని ఎంతగానో ప్రోత్సహించిన తల్లిదండ్రులను గ్రామ సర్పంచ్ ఆశీర్వాదం ప్రత్యేకంగా అభినందించారు.

కార్యక్రమ విశేషాలు మరియు ముఖ్యాంశాలు:

సముచిత సన్మానం: క్షేత్రస్థాయిలో విద్యా ప్రమాణాల మెరుగుదలకు నిరంతర హాజరు ఎంతో ప్రాముఖ్యమైనదని చాటుతూ, 26 రోజుల పాటు సంపూర్ణ హాజరు సాధించిన విద్యార్థులను మరియు వారి తల్లిదండ్రులను గ్రామ సర్పంచ్ శాలువాలు కప్పి, సాంప్రదాయబద్ధంగా ఘనంగా సన్మానించారు.

ప్రోత్సాహక బహుమతుల పంపిణీ: విద్యార్థులలో పోటీతత్వాన్ని, బడికి రావాలనే జిజ్ఞాసను మరింత రెట్టింపు చేసేందుకు సర్పంచ్ ఆశీర్వాదం చేతుల మీదుగా ప్రత్యేక ప్రశంసా పత్రాలు, విద్యా సామగ్రిని బహుమతులుగా అందజేశారు.

ఆశీఃపూర్వక అభినందనలు: గ్రామీణ ప్రాంత విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించినప్పుడే ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని ఆకాంక్షిస్తూ, సర్పంచ్ ఆశీర్వాదం విద్యార్థులందరినీ మనస్ఫూర్తిగా ఆశీర్వదించారు.

సర్పంచ్ ఆశీర్వాదం సందేశం:

ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ సభాముఖంగా మాట్లాడుతూ.. "ప్రాథమిక స్థాయిలోనే విద్యార్థులు నిరంతరం పాఠశాలకు హాజరైనప్పుడు మాత్రమే ఉపాధ్యాయులు బోధించే అంశాలపై పూర్తి పట్టు సాధించగలరు. పిల్లలను రోజూ ఎటువంటి ఆటంకాలు లేకుండా బడికి పంపడంలో తల్లిదండ్రులు చూపిన నిబద

# హైకోర్టు తీర్పును వెంటనే అమలు చేయాలి

- **రెవెన్యూ, పోలీసు అధికారులకు మంబాపూర్, రేగొండి, చైతన్య నగర్ గ్రామాల రైతుల వినతి**
- **పానాది దారిని పునరుద్ధరించి రక్షణ కల్పించాలని తహసీల్దార్, ఎస్ఐలకు వినతిపత్రాలు**

సికే న్యూస్ పెద్దేముల్ ప్రతినిధి

తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును రెవెన్యూ, పోలీసు అధికారులు పక్కాగా అమలు చేసి రైతులకు న్యాయం చేయాలని కోరుతూ వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండల పరిధిలోని మంబాపూర్, రేగొండి, చైతన్య నగర్ గ్రామాలకు చెందిన పలువురు రైతులు శనివారం మండల తహసీల్దార్ బి.వెంకటేష్ ప్రసాద్, పెద్దేముల్ ఎస్ఐ ఎం.ప్రశాంత్ వర్ధన్‌లకు వేర్వేరుగా వినతిపత్రాలు సమర్పించారు.ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ....పెద్దేముల్ మండల పరిధిలోని రేగొండి గ్రామ శివారులో గల సర్వే నంబర్లు 115, 116, 117లో తమ వ్యవసాయ భూములు ఉన్నాయని తెలిపారు.అయితే చైతన్య నగర్ గ్రామానికి చెందిన కుక్కల హనుమంతు, కుక్కల చిన్నమ్మ అనే ఇద్దరు వ్యక్తులు దశాబ్దాల కాలం నుండి ఉన్న పానాది (వ్యవసాయ దారి)ని ఆక్రమించి మూసివేయడంతో సుమారు 20 మంది రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.పానాది దారి మూసివేయడం వల్ల తమ పొలాలకు వెళ్లే మార్గం లేక పంటల సాగు చేయలేని పరిస్థితి ఏర్పడిందని,దీంతో వ్యవసాయ కార్యకలాపాలు పూర్తిగా దెబ్బతిన్నాయని తెలిపారు. సమస్య పరిష్కారం కోసం గతంలో తాము తెలంగాణ హైకోర్టును ఆశ్రయించామని చెప్పారు.ఈ కేసును విచారించిన తెలంగాణ హైకోర్టు పానాది దారి వాస్తవంగా ఉందని నిర్ధారిస్తూ, రైతులు యథావిధిగా ఆ మార్గంలో రాకపోకలు సాగించే హక్కు ఉందని స్పష్టం చేస్తూ తీర్పు ఇచ్చిందని పేర్కొన్నారు.కోర్టు ఆదేశాల మేరకు సావిత్రమ్మ, మాదాసు నర్సింహులు, అంజిలప్ప, విష్ణువర్ధన్ రెడ్డి తదితర రైతులతో పాటు ఆ దారిని వినియోగించే రైతులందరికీ ఎలాంటి ఆటంకం లేకుండా రాకపోకలు సాగేందుకు అవకాశం కల్పించాలని తీర్పులో పేర్కొన్నట్లు వివరించారు.

అందువల్ల రెవెన్యూ, పోలీసు శాఖలు సమన్వయంతో వ్యవహరించి హైకోర్టు ఆదేశాలను వెంటనే అమలు చేయడంతో పాటు పానాది దారిని పునరుద్ధరించి, రైతులకు రక్షణ కల్పించాలని తహసీల్దార్ వెంకటేష్ ప్రసాద్, ఎస్ఐ ఎం.ప్రశాంత్ వర్ధన్‌లను కోరారు.

వినతిపత్రాన్ని స్వీకరించిన అధికారులు చట్టపరమైన నిబంధనల మేరకు సమస్యను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని రైతులకు హామీ ఇచ్చినట్లు తెలిసింది.ఈ కార్యక్రమంలో కోట్‌పల్లి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ సాయిని నారాయణ రెడ్డి, మాజీ సర్పంచులు మంబాపూరం ప్రకాశం, కుక్కల ఆంజిలయ్య, మాజీ ఉపసర్పంచ్ బిచ్చప్ప, మాజీ వార్డు సభ్యుడు ఎంగూరు బాలప్ప, రైతులు సావిత్రమ్మ, మాదాసు నర్సింహులు , మాదాసు విష్ణువర్ధన్, మాదాసు భీమ్లు, మాదాసు దస్తయ్య, మాదాసు శ్రీనివాసు, సుందర్, రత్నం,తదితరులు పాల్గొన్నారు.

# 'ఎన్టీఆర్ భరోసా' పెన్షన్ల పంపిణీ

**కూటమి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించిన సింగల్ విండో అధ్యక్షులు ఎన్. గణేష్**



అమరాపురం, ఆగస్టు 1, సికే న్యూస్ :అమరాపురం మండలంలోని వలస పంచాయతీ పరిధిలోని విరుపసముద్రం గ్రామంలో 'ఎన్టీఆర్ భరోసా' పింఛన్ల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అమరాపురం మండల సింగల్ విండో అధ్యక్షులు ఎన్. గణేష్ ముఖ్య అతిథిగా పాల్గొని, లబ్ధిదారులకు స్వయంగా పింఛన్లు అందజేశారు.ఈ సందర్భంగా ఆయన గ్రామంలోని ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతోందని అన్నారు. అర్హులందరికీ పారదర్శకంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నామని, ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అందులో భాగంగా మండల డీలర్ల సంఘం అధ్యక్షులు తిప్పేస్వామి బంగారుపాళ్యం లో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీలో పాల్గొన్నారు.

# బేవినాహళ్లి గ్రామ పంచాయతీలో పశు పెంపక రైతులకు అవగాహన కార్యక్రమం

**హాజరైన డాక్టర్ షేక్ అబ్దుల్ రహీం**



హిందూపురం, ఆగస్టు 1, సికే న్యూస్ మండలం పరిధిలోని బేవినాహళ్లి గ్రామ పంచాయతీలో శనివారం రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ ఎంపీడీఓ నాగేపల్లి నారాయణ మరియు గ్రామ పంచాయతీ కార్యదర్శి దీపక్ కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పశు వైద్య సహాయకులు డాక్టర్ షేక్ అబ్దుల్ రహీం రైతులకు అలినో సేవల వినియోగం, వాటి ప్రయోజనాలు, పశు సంవర్ధక శాఖ అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరంపై వివరించారు. అలాగే ఐవీఆర్ఎస్ ద్వారా ప్రభుత్వం అందించే ఎన్టీఆర్ భరోసా పెన్షన్ మరియు పశుసంవర్ధక ముద్దచర్మ వ్యాధి నిరోధక టీకాల సేవలు, పశుగ్రాసం, చాఫకటర్ల మొదలగు సమాచారాన్ని సులభంగా పొందే విధానం, నమోదు చేసే ప్రక్రియ మరియు రైతులు ఈ సేవలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకోగా, అధికారులు రైతులు ప్రభుత్వ పథకాలు మరియు సేవలను సద్వినియోగం చేసుకుని పశుసంపద అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.



## "లెనిన్"కు ఓటీటీ పిలుపు

అక్కినేని అఖిల్, భాగ్యశ్రీ బోర్సే జోడీగా, దర్శకుడు మురళీ కిషోర్ అబ్బూరు రూపొందించిన 'లెనిన్' థియేటర్లలో అందరూ ఊహించని రేంజ్‌లో ఆడింది. నిడివైన నిరీక్షణ తర్వాత విడుదలైనా, మంచి బజ్‌తో వచ్చిన ఈ చిత్రం భారీ హిట్‌గా నిలిచింది. ఫలితంగా అఖిల్ కెరీర్‌లో మొట్టమొదటిసారి 100 కోట్ల గ్రాస్ కలెక్షన్ దాటిన బ్లాక్‌బస్టర్‌గా రికార్డు సృష్టించింది. ఇప్పుడు థియేటర్ల నుంచి ఇంటికే చేరనుంది –జీ5 ఈ చిత్ర స్ట్రీమింగ్ హక్కులు దక్కించుకుని, ఆగస్టు 7 నుంచి వీక్షకుల ముందుకు తీసుకురానున్నట్టు అధికారికంగా ప్రకటించింది. థమన్ సంగీతం అందించిన ఈ చిత్రాన్ని నాగవంశీ, నాగార్జున నిర్మించారు. అక్కినేని అభిమానులకు ఇది తీపి కబురే.

### రామాయణ తర్వాత
## "టాక్సిక్" విస్ఫోటనం

గ్లోబల్ స్టార్ యష్ ఇప్పుడు వరుస భారీ ప్రాజెక్టులతో దూసుకుపోతున్నారు. రామాయణలో రావణుడిగా ఆకట్టుకున్న ఆయన, అంతకుముందు నుంచే సిద్ధమవుతున్న 'టాక్సిక్' చిత్రం విషయంలో మేకర్స్ కీలక అప్‌డేట్ ఇచ్చారు. దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ తెరకెక్కిస్తున్న ఈ యాక్షన్ డ్రామా నుంచి ఇప్పటివరకూ బ్లాక్ అండ్ వైట్ వర్షపు పోస్టర్‌తో సందడి చేసిన టీమ్, ట్రైలర్‌ను ఆగస్టు 8న గ్రాండ్‌గా విడుదల చేయనున్నట్టు ప్రకటించింది. రామాయణ ట్రైలర్‌తో తన స్క్రీన్ ప్రెజెన్స్, యాక్షన్‌కు మంచి మార్కులు కొట్టేసిన యష్, టాక్సిక్‌లో ఎలాంటి విధ్వంసం సృష్టిస్తారో అనే ఆసక్తి అభిమానుల్లో నెలకొంది. రవి బస్రూర్ సంగీతం అందిస్తుండగా, యష్ సొంత సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఆగస్టు 26న థియేటర్లలోకి రానుంది.




### హాట్ స్టార్!




## మానుషి మనసులో నీట్ గాయం

మాజీ మిస్ వరల్డ్, నటి మానుషి చిల్లర్ తన విద్యార్థి దశలో నీట్ పేపర్ లీక్ కారణంగా పడ్డ కష్టాలను గుర్తుచేసుకున్నారు. సోహా అలీ ఖాన్ నిర్వహించే 'ఆల్ అబౌట్ హర్' టాక్ షోలో మాట్లాడుతూ, 2015 నాటి నీట్ పరీక్ష రద్దు తనపై తీవ్ర మానసిక ప్రభావం చూపిందని చెప్పారు. ఇష్టమైన కూచిపూడి నృత్యం, పెయింటింగ్‌లను ఏడాదిపాటు పక్కనబెట్టాల్సి వచ్చిందని, తల్లిదండ్రులు డాక్టర్లు కావడం మానసిక అండగా నిలిచిందని తెలిపారు. కోచింగ్ కోసం అప్పులు చేసి వేరే నగరాలకు వెళ్లే సాధారణ విద్యార్థుల ఒత్తిడిని ప్రత్యక్షంగా చూశానని పేర్కొన్నారు. పరీక్ష వాయిదా పడిన 45 రోజులు తనకు అత్యంత కష్టంగా అనిపించాయని, రోజువారీ వ్యాయామం, బాస్కెట్‌బాల్ వల్లే డిప్రెషన్‌కు దూరంగా ఉండగలిగానని వెల్లడించారు. ఎంబీబీఎస్ పూర్తి చేశాక మిస్ వరల్డ్ 2017 కిరీటం గెలిచిన మానుషి, 'సమ్రాట్ పృథ్వీరాజ్'తో బాలీవుడ్‌లో అడుగుపెట్టారు.



## "ప్యారడైజ్"కు పూర్తికానున్న పజిల్

నాని, కయాదు లోహర్ జంటగా దర్శకుడు శ్రీకాంత్ ఓదెల తెరకెక్కిస్తున్న 'ది ప్యారడైజ్' టాలీవుడ్ తదుపరి భారీ చిత్రంగా భారీ అంచనాలు మోస్తోంది. ఈ సినిమాతో నాని టైర్-1 హీరోల సరసన చేరతారని అంతా భావించారు.

అయితే వాయిదాల కారణంగా అంచనాలు కొంత సన్నగిల్లినా, ఇటీవలి టీజర్ మళ్లీ హైప్ పెంచింది. తాజాగా బ్యూటీ కీర్తి సురేష్‌తో చేయనున్న ప్రత్యేక పాట పూర్తికావడానికి కొద్ది భాగం మాత్రమే మిగిలి ఉందని, దీన్ని ఆగస్టు 6 నాటికి కంప్లీట్ చేయనున్నట్టు సమాచారం. అన్నీ ప్రణాళిక ప్రకారం జరిగితే, టీజర్‌తోపాటే విడుదల తేదీని కూడా ప్రకటించే అవకాశం ఉందని తెలుస్తోంది. అనిరుధ్ సంగీతం అందిస్తుండగా, ఎస్ఎల్‌వీ సినిమాస్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది.



## సెకెండ్ ఇన్నింగ్స్‌కు బిగ్ టర్న్

రేణుదేశాయ్ చాలా కాలంపాటు వెండితెరకు దూరంగా ఉన్నారు. దర్శకత్వం, రచన, సామాజిక సేవా కార్యక్రమాలపై దృష్టి సారించిన ఆమె.. ఆమధ్య 'టైగర్ నాగేశ్వరరావు'తో రీఎంట్రీ ఇచ్చారు. అయితే ఆ చిత్రం ఆశించిన స్థాయిలో విజయం సాధించకపోవడంతో ఆమె పునరాగమనం పెద్దగా ప్రభావం చూపలేకపోయింది. ప్రస్తుతం రేణుదేశాయ్ తదుపరి ప్రాజెక్ట్‌పై సినీవర్గాల్లో ఆసక్తికర చర్చ జరుగుతోంది. తమిళ స్టార్ హీరో ధనుష్ నటిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం ఓంలో ఆమె కీలక పాత్ర పోషించనున్నట్టు సమాచారం. ఈ చిత్రంలో లెజెండరీ నటుడు మమ్ముట్టి కూడా ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. అందులో మమ్ముట్టికి జోడీగా రేణు దేశాయ్ కనిపించనున్నారనే వార్త ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది. పేరుకు మాత్రమే పరిమితం కాకుండా, కథను కీలక మలుపు తిప్పే భావోద్వేగభరితమైన పాత్రలో ఆమె కనిపించనున్నట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం దక్షిణాది సినీ పరిశ్రమలో కంటెంట్ ఆధారిత చిత్రాలకు మంచి ఆదరణ లభిస్తోంది. అలాంటి సమయంలో గ్లామర్ పాత్రల కంటే నటనకు అవకాశం ఉన్న పాత్రలను ఎంపిక చేసుకోవడం ద్వారా రేణు దేశాయ్ తన సెకండ్ ఇన్నింగ్స్‌ను భిన్నంగా తీర్చిదిద్దుకునే ప్రయత్నం చేస్తున్నారు.



## రష్మికకు గాయం షాక్

టాలీవుడ్ తారలను గాయాలు వెంటాడుతున్న వేళ, అగ్ర కథానాయిక రష్మిక మందన్న కూడా అదే జాబితాలో చేరారు. యాక్షన్ సన్నివేశాలు, నృత్యాభ్యాసం చేసే క్రమంలో ఆమె తుంటి భాగంలోని స్నాయువు పూర్తిగా తెగిపోయింది. గాయం తీవ్రతను చూసి వైద్యులే ఆశ్చర్యపోయినట్టు సన్నిహిత వర్గాలు తెలిపాయి. క్రీడాకారుల్లో సాధారణంగా కనిపించే ఇలాంటి గాయానికి ఆరు వారాలపాటు పూర్తి విశ్రాంతి తప్పనిసరని వైద్యులు సూచించారు. ప్రస్తుతం 'రణబలి', 'మైసా' చిత్రాల్లో బిజీగా ఉన్న రష్మిక, పాన్ ఇండియా స్థాయిలో నాలుగు భారీ ప్రాజెక్టులతో పాటు పలు ప్రకటనల చిత్రీకరణలకు కూడా కట్టుబడి ఉన్నారు. ఈ గాయం కారణంగా ఆ షెడ్యూళ్లన్నీ ప్రస్తుతానికి నిలిచిపోనున్నాయి.



## "ఇరుముడి" నుంచి రెండో మెలోడీ

రవితేజ, దర్శకుడు శివ నిర్వాణ కాంబోలో రూపొందుతున్న 'ఇరుముడి' తెలుగుతో పాటు తమిళంలోనూ విడుదలకు సిద్ధమవుతోంది. ఇప్పటివరకూ వచ్చిన ప్రతి అప్‌డేట్ అభిమానుల్లో ఆసక్తి రేకెత్తించగా, విడుదల సమీపిస్తున్న వేళ మేకర్స్ రెండోపాట గురిం చి తీపి కబురు అందించారు. అందమైన ఫ్యామిలీ పోస్టర్‌తో పాటు, ఆగస్టు 3న ఉదయం సరిగ్గా 11:07 గంటలకు ఈ సాంగ్ విడుదల చేస్తున్నట్టు వెల్లడించారు. 'యాలో యాలో' అనే పల్లవితో సాగనున్న పాట కోసం ఫ్యాన్స్ ఇప్పటినుంచే ఎదురు చూస్తున్నారు. జీవీ ప్రకాష్ సంగీతం అంది స్తుండగా, మైత్రి మూవీమేకర్స్ ఈచిత్రాన్ని నిర్మిస్తున్నారు.రాబోయే రోజుల్లో వరుస అప్ డేట్స్ ఇవ్వనున్నట్టు సంకేతాలు వస్తున్నాయి.




## ట్రోలర్లకు కంగన కౌంటర్

నటి, బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ తనపై వస్తున్న ట్రోలింగ్‌పై తీవ్రంగా స్పందించారు. యువతను ఉద్దేశించి ఆమె చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై విమర్శలు వెల్లువెత్తగా, కొందరు నెటిజన్లు ఆమె పాత సినిమా సన్నివేశాలను, వీడియోలను వైరల్ చేశారు. దీనిపై ఇన్‌స్టాలో స్పందించిన కంగన, తన సినిమా పాత్రలకు వ్యక్తిగత జీవితానికి ముడిపెట్టొద్దని కోరారు. భారీ పారితోషికం తీసుకుని పాత్రలు పోషించడం వేరని, పబ్లలో, రోడ్లపై యువత అలాగే ప్రవర్తించొచ్చని చెప్పలేమని స్పష్టం చేశారు. నటిగా వృత్తిపరమైన పాత్రలకు తాను సిగ్గుపడాల్సిన అవసరం లేదని పేర్కొన్న ఆమె, యువతను తప్పుదోవ పట్టించొద్దని హితవు పలికారు. ఇతరుల పిల్లలను తప్పుదోవ పట్టిస్తే రేపు అదే పరిస్థితి సొంత పిల్లలకూ రావచ్చని హెచ్చరించారు.

